RNI No: TELTEL2022/83073

# వేద న్యూస్
దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:54 | ఫిబ్రవరి 01, 2026 | వెల: రూ.3-00

## మేడారంలో కట్టలు తెంచుకున్న భక్తుల ఆగ్రహం

- బస్టాండ్ వద్ద ఆందోళన.. ఆర్టీసీ బస్సు అద్దాలు ధ్వంసం
- ట్రాఫిక్ జామ్‌తో స్తంభించిన తిరుగు ప్రయాణం

2లో





# మళ్లొస్తాం తల్లీ!

## ముగిసిన మేడారం మహా జాతర

### సంప్రదాయం ప్రకారం తల్లుల వన ప్రవేశం

- కోట్లాది మంది భక్తులు దర్శించినట్లు అంచనా
- చివరి రోజు పెరిగిన వీఐపీల తాకిడి
- ఇంకా కొనసాగుతున్న మొక్కులు
- అడవుల్లో ఇప్పుడిప్పుడే ఖాళీ అవుతున్న గుడారాలు
- భారమైన హృదయంతో ఇంటి బాట పడుతున్న భక్తులు
- తిరుగుబాట పట్టిన వేలాది వాహనాలు
- యువ అధికారులు పెత్తనం.. గిరిజన పూజారుల అసంతృప్తి

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా, మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర అత్యంత వైభవంగా ముగిసింది. నాలుగు రోజుల పాటు కోట్లాది మంది భక్తుల నీరాజనాలు అందుకున్న వనదేవతలు శనివారం సాయంత్రం సంప్రదాయబద్ధంగా వనప్రవేశం చేశారు. తల్లుల దర్శనంతో పులకించిపోయిన భక్తజనం భార హృదయంతో తిరుగు ప్రయాణమవుతుండటంతో, నెల రోజులుగా జనసంద్రంగా మారిన తాడ్వాయి అడవులు ఇప్పుడు నిశ్శబ్దంలోకి జారుకుంటున్నాయి. యంత్రాంగం జాతరను విజయవంతంగా పూర్తి చేసి ఊపిరి పీల్చుకున్నప్పటికీ, నిర్వహణ తీరుపై గిరిజన పూజారులు వ్యక్తం చేస్తున్న అసంతృప్తి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

2లో

## పసిడి, వెండి ధమాల్!

### మార్కెట్‌లో భారీ కుదుపు

- ఒక్కరోజే రూ.14వేలు పడిపోయిన బంగారం
- సిల్వర్ కిలోకు దాదాపు లక్ష నష్టం

2లో



## హైదరాబాద్ కోఠిలో కాల్పుల కలకలం

- ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గన్‌తో కాల్పులు.. రూ.6 లక్షల దోపిడీ
- డబ్బులు డిపాజిట్ చేసేందుకు వచ్చిన రషీద్‌పై దాడి
- సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు

2లో



## రేవంత్ ప్రభుత్వానిది పైశాచిక ఆనందం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో

# నేడు సిట్ ముందుకు గులాబీ బాస్!

వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో నేడు జరగబోయే కేసీఆర్ విచారణ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. విచారణకు సహకరిస్తానని చెబుతూనే, సిట్ అధికారులు వ్యవహరించిన తీరు రాజ్యాంగ విరుద్ధమని కేసీఆర్ తీవ్రస్థాయిలో స్పందిస్తూ లేఖ ద్వారా విమర్శించారు. వయస్సు నిబంధనలు మరియు నివాస అడ్రస్ మార్పు వంటి సాంకేతిక అంశాలను ప్రస్తావిస్తూనే, పోలీసుల జాతరలా సాగుతున్న విచారణ తీరుపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు మున్సిపల్ ఎన్నికల టెన్షన్, మరోవైపు అధినేత విచారణతో గులాబీ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

2లో

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను ప్రశ్నించనున్న అధికారులు

- 3 గంటలకు నందినగర్ నివాసంలోనే విచారణ
- ముందు రోజే న్యాయ నిపుణులతో సుదీర్ఘ చర్చ
- ఆందోళనలో బీఆర్ఎస్ క్యాడర్
- ఓ వైపు మున్సిపల్ ఎన్నికలు.. మరో వైపు సిట్ విచారణ
- జరగనున్న పరిణామాలపై తీవ్ర ఉత్కంఠ



## సిట్ అధికారుల తీరు చట్ట విరుద్ధం

### నన్ను ప్రశ్నించే అర్హత మీకు లేదు

సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కారు

రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం

జూబ్లిహిల్స్ ఏసీపీకి సంచలన లేఖ

2లో

వేద న్యూస్

ఆదివారం | ఫిబ్రవరి 01, 2026

# పసిడి, వెండి ధమాల్!

**ఒక్కరోజే రూ.14వేలు పడిపోయిన బంగారం**
**వెండికి కిలోకు దాదాపు లక్ష నష్టం**
**గోల్డ్, సిల్వర్ మార్కెట్‌లో భారీ కుదుపు**

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

దేశీయ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం భారీ ఒడిదుడుకులు చోటు చేసుకున్నాయి. ఇటీవల ఆల్‌టైమ్ హై స్థాయిలతో దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా భారీగా కుప్పకూలాయి. పెట్టుబడిదారులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం, అంతర్జాతీయ మార్కెట్ నుంచి వచ్చిన బలహీన సంకేతాలు ఈ పతనానికి ప్రధాన కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర ఒక్కరోజే రూ.14వేలు తగ్గి రూ.1,69,000కు చేరింది. అంతకుముందు రోజు రూ.1,83,000 వరకు చేరిన పసిడి ఇలా ఒక్కసారిగా దిగజారడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఫ్యూచర్స్ మార్కెట్‌లోనూ ఇదే ధోరణి కనిపించగా, గోల్డ్ ఫ్యూచర్స్ దాదాపు 9 శాతం క్షీణించాయి. వెండి పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. స్పాట్ మార్కెట్‌లో కిలో వెండి ధర సుమారు రూ.20వేలు తగ్గి రూ.3,84,500గా నమోదైంది. మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్‌లో వెండి ఫ్యూచర్స్ ఒక్కరోజే సుమారు 25 శాతం పడిపోవడంతో కిలోకు దాదాపు రూ.1 లక్ష వరకు నష్టం నమోదైంది.

మార్చి డెలివరీ వెండి ధర రూ.67,000కుపైగా తగ్గి రూ.3.32 లక్షల వద్ద ట్రేడైంది. హైదరాబాద్ మార్కెట్‌లో 22 క్యారెట్ బంగారం తులం ధర రూ.1,55,100గా ఉండగా, వెండి కిలో ధర రూ.3,95,000గా నమోదైంది. అంతర్జాతీయంగా కూడా లోహాలపై ఒత్తిడి కనిపించింది. గ్లోబల్ మార్కెట్‌లో గోల్డ్, సిల్వర్ ధరలు గణనీయంగా తగ్గగా, అమెరికా డాలర్ బలపడటం దీనికి ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధానాలపై స్పష్టత రావడం, డాలర్ ఇండెక్స్ బలపడటంతో బంగారం, వెండి వంటి లోహాలపై డిమాండ్ తగ్గిందని నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో లాభాలు బుక్ చేసుకునే దిశగా ఇన్వెస్టర్లు అడుగులు వేయడం ధరల పతనానికి దారితీసిందని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ బులియన్ మార్కెట్‌లో ఒడిదుడుకులు కొనసాగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# రేవంత్ ప్రభుత్వానిది పైశాచిక ఆనందం

- కేసీఆర్ ఇంటి గోడకు నోటీసులు
- నిబంధనలు ఉల్లంఘించారంటూ ఆరోపణలు
- కేటీఆర్ ఆగ్రహం



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు హాజరుకావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సిట్ జారీ చేసిన నోటీసుల వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసం గోడకు నోటీసులు అతికించడాన్ని ఖండిస్తూ, ఇది 'పైశాచిక ఆనందం' కోసమే చేసిన చర్యగా ఆయన విమర్శించారు.ఎక్స్ వేదికగా స్పందించిన కేటీఆర్.. తెలంగాణ రాష్ట్ర సాధకుడు, ప్రధాన ప్రతిపక్ష నేత అయిన కేసీఆర్‌పై ఇలాంటి దుర్మార్గపు వైఖరి ఏంటని ప్రశ్నించారు. సిట్ అధికారులకు కేసీఆర్ స్వయంగా తన చిరునామా అందించినప్పటికీ, రాత్రిపూట నివాసానికి వెళ్లి గోడకు నోటీసులు అతికించడం అహంకారానికి నిదర్శనమని ఆరోపించారు.65 ఏళ్లు దాటిన వ్యక్తులను వారి నివాసంలోనే విచారించాలన్న నిబంధనలను పోలీసులు ఉల్లంఘించారని కేటీఆర్ పేర్కొన్నారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను పక్కనపెట్టి, ప్రభుత్వ ఒత్తిడితో ప్రతిపక్ష నేతలను వేధిస్తున్నారా అంటూ పోలీసులను ప్రశ్నించారు. ఇలాంటి అక్రమ కేసులన్నింటినీ ఛేదించి ప్రజల ముందుకు తీసుకువస్తామని హెచ్చరించారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ తొలిసారి జారీ చేసిన నోటీసులపై కేసీఆర్ చేసిన విజ్ఞప్తిని అధికారులు తిరస్కరించిన అనంతరం రెండోసారి నోటీసులు జారీ చేశారు. నోటీసులు అందించేందుకు నందినగర్‌లోని నివాసానికి వెళ్లిన అధికారులు, ఇంటికి తాళం ఉండటంతో గోడకు నోటీసులు అతికించినట్లు వెల్లడైంది. ఈ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

# హైదరాబాద్ కోఠిలో కాల్పుల కలకలం

- ఎస్‌బీఐ ఏటీఎం వద్ద గన్‌తో కాల్పులు.. రూ.6 లక్షల దోపిడీ
- డబ్బులు డిపాజిట్ చేసేందుకు వచ్చిన రషీద్‌పై దాడి
- సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు

**వేద న్యూస్, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలోని కోఠి ప్రాంతంలో జరిగిన కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. కోఠిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎం వద్ద దుండగులు గన్‌తో కాల్పులు జరిపి సుమారు రూ.6 లక్షల నగదును దోచుకుని పరారైనట్లు పోలీసులు వెల్లడించారు.డబ్బులు డిపాజిట్ చేసేందుకు ఏటీఎం వద్దకు వచ్చిన రషీద్‌పై దుండగులు దాడికి పాల్పడి కాల్పులు జరిపినట్లు సమాచారం. ఈ ఘటనలో రషీద్‌కు గాయాలు కాగా, అతడిని వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనపై సమాచారం అందుకున్న సుల్తాన్ బజార్ పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏటీఎం పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల ఫుటేజ్‌ను పరిశీలిస్తూ దుండగుల కదలికలను గుర్తించే ప్రయత్నం చేస్తున్నారు. నగరంలో ఇటీవల వరుసగా నేరాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఈ ఘటనపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. నిందితులను త్వరలోనే గుర్తించి అరెస్ట్ చేస్తామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

# మళ్లొస్తాం తల్లీ!

**ముగిసిన మేడారం మహా జాతర**

- సంప్రదాయం ప్రకారం తల్లుల వన ప్రవేశం
- కోట్లాది మంది భక్తులు దర్శించినట్లు అంచనా
- చివరి రోజు వీఐపీల తాకిడీ
- ఇంకా కొనసాగుతున్న మొక్కులు
- అడవుల్లో ఇప్పుడిప్పుడే ఖాళీ అవుతున్న గుడారాలు
- భారమైన హృదయంతో ఇంటి బాట పడుతున్న భక్తులు
- మేడారం నుంచి తిరుగుబాట పట్టిన వేలాది వాహనాలు
- యువ అధికారులు పెత్తనం.. గిరిజన పూజారుల అసంతృప్తి

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**



ఆసియాలోనే అతిపెద్ద గిరిజన కుంభమేళా మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర అత్యంత వైభవంగా ముగిసింది. నాలుగు రోజుల పాటు కోట్లాది మంది భక్తుల నీరాజనాలు అందుకున్న వనదేవతలు.. నేడు తిరిగి వనప్రవేశం చేశారు. తల్లుల దర్శనంతో పులకించిపోయిన భక్తజనం భార హృదయంతో తిరుగు ప్రయాణమవుతుండటంతో తాడ్వాయి అడవులు నెమ్మదిగా ఖాళీ అవుతున్నాయి.

### వనంలోకి వనదేవతలు

జాతరలో అత్యంత కీలకమైన తుది ఘట్టం వనప్రవేశం ఈరోజు పూర్తయింది. గద్దెలపై కొలువుదీరిన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవింద రాజులను పూజారులు సంప్రదాయబద్ధంగా తిరిగి వనంలోకి తీసుకెళ్లారు. వనదేవతలు అడవిలోకి వెళ్లడంతో జాతర అధికారికంగా ముగిసినట్లయింది. చివరి రోజు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి తల్లులను దర్శించుకున్నారు. పలువురు ప్రముఖులు కూడా నేడు గద్దెలను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

### కొనసాగుతున్న మొక్కులు..

జాతర అధికారికంగా ముగిసి, దేవతలు వన ప్రవేశం చేసినప్పటికీ మేడారంలో భక్తుల మొక్కుల పర్వం ఇంకా కొనసాగుతూనే ఉంది. జాతర ప్రధాన నాలుగు రోజుల్లో భక్తుల రద్దీ ఊహించని స్థాయిలో ఉండటంతో, గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడలేని వృద్ధులు, చిన్న పిల్లలు ఉన్న కుటుంబాలు ఇప్పుడు నెమ్మదిగా మొక్కులు చెల్లించుకుంటున్నారు. తొక్కిసలాటలు, రద్దీ భయంతో అప్పుడు రాలేకపోయిన భక్తులు.. ఇప్పుడు గద్దెల వద్దకు చేరుకుని ప్రశాంతంగా నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. రద్దీ కాస్త తగ్గడంతో తల్లులను కళ్లారా చూసుకునే అవకాశం దక్కుతుందని భావించే భక్తుల రాకతో మేడారం పరిసరాల్లో ఇంకా జాతర సందడి కనిపిస్తూనే ఉంది.

### ఖాళీ అవుతున్న తాడ్వాయి అడవులు

గత నెల రోజులుగా జనసందోహంతో, శిబిరాలతో కిటకిటలాడిన తాడ్వాయి అడవులు ఇప్పుడు మళ్లీ ఖాళీ అవుతున్నాయి. వనదేవతల దర్శనం ముగించుకున్న భక్తులు తమ సొంత ఊళ్లకు తిరుగు ప్రయాణమయ్యారు. ఎటు చూసినా భక్తుల వాహనాలతో మేడారం పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. వనదేవతల దర్శనం ముగించుకున్న భక్తులు తాము వేసుకున్న తాత్కాలిక గుడారాలను తొలగించి, తమ సామాన్లను సర్దుకుని తిరుగు ప్రయాణమవుతున్నారు. జాతర పొడవునా భక్తుల కోలాహలం, వంటల పొగలు, సమ్మక్క–సారలమ్మ నామ స్మరణతో మార్మోగిన అడవి ప్రాంతం.. ఇప్పుడు గుడారాలు ఖాళీ అవుతుండటంతో బోసిపోతోంది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు తమ బసను ముగించుకుని వాహనాల్లో వెనుదిరుగుతుండటంతో, గుడారాల స్థానంలో ఇప్పుడు కేవలం ఖాళీ ప్రదేశాలే కనిపిస్తున్నాయి.

### చివరి రోజు ప్రముఖుల దర్శనాలు

మేడారం జాతర చివరి రోజున గద్దెల వద్ద ప్రముఖుల సందడి నెలకొంది. వనదేవతలు వనప్రవేశం చేసే ముందు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు ఉన్నతాధికారులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీని పర్యవేక్షిస్తూనే, ప్రజా ప్రతినిధులు గద్దెల వద్దకు చేరుకుని నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనదేవతల ఆశీస్సులు పొందేందుకు చివరి నిమిషం వరకు వీఐపీల తాకిడి కొనసాగడంతో, అధికారులు వారికి దర్శన ఏర్పాట్లలో ఎక్కడా ఆటంకం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

### ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం

కోట్లాది మంది భక్తులు తరలివచ్చిన ఈ మహాజాతరను విజయవంతంగా నిర్వహించిన అధికారులు.. జాతర విజయవంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు. గత నెల రోజులుగా నిద్రాహారాలు మాని ఏర్పాట్లలో నిమగ్నమైన రెవెన్యూ, పోలీస్, దేవాదాయ మరియు ఆరోగ్య శాఖల అధికారులు జాతర ప్రశాంతంగా ముగియడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చివరి రోజైన నేడు కూడా భక్తుల రద్దీ కొనసాగినప్పటికీ, పోలీసులు, వలంటీర్ల సహకారంతో దర్శనాలు సజావుగా సాగాయి. తల్లుల దీవెనలు పొంది, పసుపు, కుంకుమలు ధరించి భక్తులు వచ్చే జాతరకు మళ్లీ వస్తామమ్మా.. అంటూ మొక్కులు చెల్లించి వెనుదిరుగుతున్నారు.

### గిరిజన పూజారుల అసంతృప్తి..

మేడారం జాతర నిర్వహణ తీరుపై ఈసారి గిరిజన పూజారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న అనుభవజ్ఞులైన సీనియర్ అధికారుల సలహాలను, సూచనలను ప్రస్తుత యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోలేదని వారు ఆరోపిస్తున్నారు. జాతర బాధ్యతలన్నీ కేవలం యంగ్ ఆఫీసర్స్ చేతుల్లో ఉండటంతో, వారికి క్షేత్రస్థాయి పరిస్థితులపై అవగాహన లేక పూజారులను సైతం ఇబ్బందులకు గురిచేశారని వారు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇది గిరిజన బిడ్డల జాతరలా ఉందా? లేక పోలీసుల జాతరలా ఉందా? అని పూజారులు ఘాటుగా ప్రశ్నిస్తున్నారు. జాతర సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా, అధికారుల పెత్తనమే ఎక్కువగా సాగిందంటూ గిరిజన పూజారులు వ్యక్తం చేస్తున్న ఆవేదన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# నేడు సిట్ ముందుకు కేసీఆర్

- ఫోన్ ట్యాపింగ్ కేసులో గులాబీ బాస్‌ను ప్రశ్నించనున్న అధికారులు
- మధ్యాహ్నం 3 గంటలకు నందినగర్ నివాసంలోనే విచారణ
- ముందు రోజే న్యాయ నిపుణులతో సుదీర్ఘ చర్చ
- ఆందోళనలో బీఆర్ఎస్ క్యాడర్
- ఓ వైపు మున్సిపల్ ఎన్నికలు.. మరో వైపు సిట్ విచారణ
- జరగనున్న పరిణామాలపై తీవ్ర ఉత్కంఠ

**వేద న్యూస్, పొలిటికల్ బ్యూరో**

తెలంగాణ రాజకీయాల్లో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావు నేడు మధ్యాహ్నం 3 గంటలకు సిట్ అధికారుల విచారణకు హాజరుకానున్నారు. బంజారాహిల్స్‌లోని ఆయన నందినగర్ నివాసమే ఈ కీలక విచారణకు వేదిక కాబోతోంది. శనివారం ఉదయం నుంచే నందినగర్ నివాసంలో రాజకీయ, న్యాయపరమైన కార్యకలాపాలు ఊపందుకున్నాయి. విచారణకు ఒకరోజు ముందే కేసీఆర్ తన లీగల్ టీమ్ మరియు పార్టీ సీనియర్ నేతలతో సుదీర్ఘంగా చర్చించారు. సిట్ అధికారులు ఏయే అంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది? గత ప్రభుత్వ హయాంలో ఇంటెలిజెన్స్ అధికారుల వ్యవహారశైలిపై ఎలాంటి సమాధానాలు ఇవ్వాలి? అన్న అంశాలపై లోతుగా చర్చించారు. విచారణ సమయంలో అధికారులు రికార్డ్ చేసే స్టేట్‌మెంట్‌కు ఉన్న చట్టబద్ధత, ఒకవేళ విచారణ అనంతరం పరిణామాలు తీవ్రంగా ఉంటే తీసుకోవాల్సిన న్యాయపరమైన చర్యలపై లాయర్లు కేసీఆర్‌కు దిశానిర్దేశం చేశారు.

### నోటీసుల అడ్రస్ మార్పుపై కేసీఆర్ మెలిక!

సిట్ అధికారుల తీరుపై కేసీఆర్ లేఖ రాయడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నందినగర్ నివాసంలో ఎవరూ అందుబాటులో లేరని తెలిసి కూడా, ఉద్దేశపూర్వకంగా అక్కడికి వెళ్లి నోటీసులను గోడకు అంటించడం తనను అవమానించడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మాజీ ముఖ్యమంత్రి పట్ల అధికారులు అనుసరించిన ఈ పద్ధతి సరికాదని కేసీఆర్ తన లేఖలో పేర్కొన్నారు. ఇకపై తనకు ఎలాంటి నోటీసులు జారీ చేయాలన్నా, తాను ప్రస్తుతం నివాసముంటున్న ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ అడ్రస్‌కే పంపాలని ఆయన స్పష్టం చేశారు. అధికారుల చర్యపై అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, చట్టం పట్ల గౌరవంతో తాను నిర్ణీత సమయానికి విచారణకు హాజరవుతానని కేసీఆర్ తన లేఖలో ధృవీకరించారు.

### గులాబీ శ్రేణుల్లో పెరిగిన టెన్షన్

కేసీఆర్ విచారణ వార్తలతో రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఒక మాజీ ముఖ్యమంత్రిని విచారించడం అంటే అది రాజకీయ వేధింపేనని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. రేపు నందినగర్ వద్ద భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒకవైపు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం, వ్యూహ ప్రతివ్యూహాలతో బిజీగా ఉన్న పార్టీకి.. ఇప్పుడు విచారణ అనేది మింగుడుపడని అంశంగా మారింది. ఎన్నికల వేళ ఈ పరిణామాలు ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయోనని మథనపడుతున్నారు.

### విచారణలో కీలక అంశాలు ఇవే..

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కేసీఆర్‌కు ముందే తెలుసా? అప్పటి ఇంటెలిజెన్స్ ఐజీ ప్రభాకర్ రావు, ఇతర అధికారులకు ఆయన నేరుగా ఆదేశాలు ఇచ్చారా? అన్న కోణంలో విచారణ సాగనుంది. సిట్ సేకరించిన ఎలక్ట్రానిక్ సాక్ష్యాలు, డాక్యుమెంట్లు కేసీఆర్ ముందు ఉంచి వివరణ కోరనున్నారు. ఇచ్చే సమాధానాల ఆధారంగా సిట్ అధికారులు అరెస్ట్ వరకు వెళ్తారా? కేవలం స్టేట్‌మెంట్‌తో సరిపెట్టి చార్జిషీట్‌లో పేరు చేరుస్తారా? అన్నది ఇప్పుడు అందరినీ ఆందోళనకు గురిచేసే అంశం.

# సిట్ అధికారుల తీరు చట్ట విరుద్ధం

- సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కారు
- నోటీసులు ఇచ్చే అధికారమే లేదు
- రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం

**వేదన్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

సిట్ అధికారులు వ్యవహరించిన తీరు చట్టాలకు పూర్తిగా వ్యతిరేకమని, సుప్రీంకోర్టు తీర్పులను తుంగలో తొక్కినట్లేనని బీఆర్ఎస్ అధినేత కె. చంద్రశేఖర్ రావు తీవ్రంగా విమర్శించారు. సిట్ అధికారులకు నోటీసులు జారీ చేసే అధికారమే లేదని, తమ చర్యల ద్వారా తన రాజ్యాంగ హక్కులను కాలరాశారని కేసీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు సిట్ అధికారులకు రిప్లై లేఖ పంపించారు. తనకు గతంలో రెండు సార్లు ఇచ్చిన నోటీసులు చట్ట విరుద్ధమని, చట్టాలకు అతిక్రమించి జారీ చేశారని కేసీఆర్ లేఖలో స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిజీగా ఉండటంతో మొదటి నోటీసుకు వేరే తేదీ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. అలాగే అరవై ఐదు ఏళ్లు పైబడిన వ్యక్తులను వారు నివసించే చోటనే విచారించాలని చెప్పే సీఆర్పీసీ సెక్షన్ నూట అరవై నిబంధనలను సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు.
అదే విధంగా తదుపరి నోటీసులన్నీ ఎర్రవల్లిలోని తన ప్రస్తుత నివాసానికే పంపాలని స్పష్టంగా తెలియజేశానని కేసీఆర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, రాత్రి తొమ్మిది గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు మీ సంతకంతో ఉన్న లేఖను నందినగర్ నివాసంలోని ఇంటి గోడకు అతికించినట్లు తెలిసిందని ఆక్షేపించారు. ఆ లేఖ సిట్ అధికారుల సూచనల మేరకే అతికించారంటే దానిని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. చట్టపరమైన అంశాలు ఎలా ఉన్నప్పటికీ, మాజీ ముఖ్యమంత్రిగా, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడిగా, బాధ్యతాయుతమైన భారత పౌరుడిగా దర్యాప్తుకు సహకరించాలని నిర్ణయించుకున్నట్లు కేసీఆర్ వెల్లడించారు. సిట్ అధికారులు నందినగర్ నివాసంలోనే స్టేట్‌మెంట్ నమోదు చేయాలని పట్టుబట్టినందున, రేపు మధ్యాహ్నం మూడు గంటలకు నందినగర్‌లో అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. సిట్ అధికారుల చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంటూ, చట్ట పరిధిలోనే విచారణ జరగాలని కేసీఆర్ డిమాండ్ చేశారు.

# మేడారంలో కట్టలు తెంచుకున్న భక్తుల ఆగ్రహం

**వేద న్యూస్, మేడారం**



మేడారం మహాజాతర సందర్భంగా భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తాత్కాలిక బస్టాండ్ వద్ద తిరుగు ప్రయాణానికి గంటల తరబడి బస్సుల కోసం నిరీక్షించాల్సి రావడంతో భక్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది.బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సులు సమయానికి అందుబాటులోకి రాకపోవడం, సరైన సమాచారం ఇవ్వకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తిరుగు ప్రయాణ ఏర్పాట్లు సరిగా లేవంటూ భక్తులు అధికారులపై మండిపడ్డారు. ఈ క్రమంలో ఆందోళనకు దిగిన కొందరు భక్తులు ఓ ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.బస్టాండ్ పరిసరాల్లో గందరగోళం ఏర్పడగా, ప్రధాన రహదారులపై వాహనాలు నిలిచిపోవడంతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. గంటల తరబడి వాహనాలు కదలకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితిని నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.తిరుగు ప్రయాణ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా చేతులెత్తేసినట్టుగా కనిపిస్తోందని భక్తులు ఆరోపిస్తున్నారు. భక్తుల భద్రత, సౌకర్యాల దృష్ట్యా తక్షణమే అదనపు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# గోండు రాజుల పురాతన శివాలయం

- ఒక్క రాత్రిలో ఆలయ నిర్మాణం
- జిల్లా కేంద్రానికి 12 కిలో మీటర్ల దూరంలో..
- కొండ శిఖరం పై అద్భుత కట్టడం

**వేద న్యూస్, ఆసిఫాబాద్:**



పచ్చని అడవి, కొండ కోనలు, ప్రకృతి సంపదకు నెలవై గోండు రాజులు పాలించిన ఘన చరిత్ర కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాకి సొంతం. అంతటి చరిత్ర కలిగిన ఆసిఫాబాద్ లో ఆనాటి గోండు రాజుల ఎన్నో కట్టడాలు నేటికి చెక్కు చెదరకుండా ఆసిఫాబాద్ ప్రజల వారసత్వ సంపద గా కొనసాగుతున్నాయి.

**12 వ శతాబ్దం నాటి..**

తాజాగా ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం నుండి దాదాపు 12 కిలో మీటర్ల దూరంలో గల దేవదుర్గం అనే చిన్న మారుమూల ఆదివాసి గూడెంలో రాతితో నిర్మించిన శివాలయం ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నది. దాదాపు 10 కిలో మీటర్లు దట్టమైన అడవిలో కాలినడకన వెళితే ఓ కొండ శిఖరం పై ఈ



ఆలయం దర్శనమిస్తుంది. గ్రామస్థులు, కొంత మంది ఆదివాసీ నాయకుల వివరాల ప్రకారం.. ఈ ఆలయం 12 నుండి 14 వ శతాబ్దంలో ఓ రాజు, రాణి ఈ ఆలయాన్ని ఒక్క రాత్రిలో నిర్మించి తెల్లవారక ముందు ఈ



ప్రదేశాన్ని వదిలి వెళ్ళారని చెబుతున్నారు. ఈ ఆలయ నిర్మాణ శైలి చతురస్ర కారపు మండపం, నగర శైలి లో ఉంది. కాగా, మహారాష్ట్ర లోని గడ్చిరోలి జిల్లా తనేగాం, ఆర్మోరీ లో గల శివాలయాలు సైతం దాదాపు ఇదే



నిర్మాణ శైలి పోలివుందని తన పరిశోధనలో వెల్లడైనట్లు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కి చెందిన యువ దర్శకుడు దండనాయకుల మానస్ తెలిపారు. ఈ ఆలయ నిర్మాణ ప్రాంతాన్ని బట్టి నాటి కాలంలో ఇక్కడ పెద్ద పట్టణ ప్రాంతం ఉండి ఉండవచ్చని కాలనుక్రమం ప్రజలు వలసలు వెళ్లడం ఎవరు పట్టించుకోక పోవడం వలన ఆలయం శిథిలావస్థకు చేరి ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ఈ ఆలయాన్ని ప్రభుత్వం పునరుద్ధరించి ఆలయానికి వెళ్లడానికి మార్గాన్ని ఏర్పాటు చేసి నాటి రాజుల వారసత్వ సంపదగా కాపుడుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పాలిటెక్నిక్‌లో టైప్‌రైటింగ్ పరీక్షలు ముగింపు

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ప్రభుత్వం టెక్నికల్ బోర్డు ఆధ్వర్యంలో ఆరు నెలలకు ఒకసారి నిర్వహించే టైప్‌రైటింగ్ పరీక్షలు రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ప్రశాంతంగా ముగిశాయి. కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకరాచారి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించగా, అవసరమైన అన్ని వసతులు కల్పించారు. ఈ సందర్భంగా టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్స్ మజీద్, రఫీ మాట్లాడుతూ.. టైప్‌రైటింగ్ అర్హతతో ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్-3లో టైపిస్ట్ పోస్టులు భర్తీ చేయగా, హైకోర్టు, జిల్లా కోర్టుల్లో ప్రతి సంవత్సరం టైపిస్ట్, కాపిస్ట్ పోస్టులకు హయ్యర్ గ్రేడ్ టైప్ పాస్ అయిన వారికి అవకాశాలు ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం ఫిబ్రవరి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా కోర్టుల ఉద్యోగాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నందున, అర్హులైన అభ్యర్థులు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్ రంగాల్లోనూ టైపిస్ట్ ఉద్యోగాలు ఉంటాయని తెలిపారు. జూన్‌లో జరిగే తదుపరి టైప్‌రైటింగ్ పరీక్షలకు యువత, నిరుద్యోగులు ఇప్పటి నుంచే శిక్షణ పొందాలని, టైప్‌రైటింగ్ ఇన్‌స్టిట్యూట్లలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని వారు తెలిపారు.

# విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు

- పరీక్షల భయాన్ని వీడాలి
- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక ఆరోగ్య అవగాహన

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట:**



ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పరీక్షల సమయంలో భయం, ఒత్తిడికి లోనుకావద్దని సూచించారు. రోజూ వ్యాయామం, ధ్యానం చేయడం, శుభ్రత పాటించడం ద్వారా మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. మానసిక సమస్యల లక్షణాలు, నివారణ మార్గాలను వివరించారు. అవసరమైతే ప్రభుత్వ హెల్ప్‌లైన్ 14416కు కాల్ చేసి ఉచిత సలహాలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ గజ్జెల గంగాధర్, కళాశాల ఇన్‌చార్జ్ క్యాతం సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో వాహనాల తనిఖీలు



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

- 2.342 కిలోల వెండి పట్టగొలుసులు స్వాధీనం

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసులు అప్రమత్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఉదయం రగుడు వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టులో వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల సమయంలో టీఎస్08 ఖీఎ 6726 నంబర్ గల కారును ఆపి పరిశీలించగా, లెక్కలలో లేని 2.342 కిలోల వెండి పట్టగొలుసులు ఉన్నట్లు గుర్తించారు. కారును నడుపుతున్న వ్యక్తి మెట్పల్లి గ్రామానికి చెందిన తోగిటి సత్యానారాయణ వాసిగా పోలీసులు గుర్తించారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎస్ఎస్‌టీ బృంద ఇన్‌చార్జ్ జి. ఆనంద్, ఏపీఓ సమక్షంలో, మధ్యవర్తుల పంచనామా సాక్షుల ఎదుట వెండి పట్టగొలుసులను స్వాధీనం చేసుకున్నారు. వీటి మూలం, ఉపయోగ ఉద్దేశ్యంపై విచారణ కొనసాగుతోందని సిరిసిల్ల టౌన్ ఇన్స్పెక్టర్ కే. కృష్ణ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభపెట్టే ఉద్దేశంతో డబ్బులు, మద్యం లేదా విలువైన వస్తువుల తరలింపుపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన కోరారు.

# కోతుల బెడదకు చెక్

- నలుగురు సర్పంచుల ఉమ్మడి వ్యూహం

**వేద న్యూస్, కారేపల్లి**



గ్రామాల్లో పెరిగిన కోతుల బెడదను నియంత్రించేందుకు నాలుగు గ్రామాల సర్పంచులు ఐక్యంగా ముందుకు వచ్చారు. భాగ్యనగర్ తండా సర్పంచ్ హీరాలాల్, గుట్టకిందిగుంపు రాఘవులు, పొలంపల్లి హేమలత, ఉసిరికాయలపల్లి వరలక్ష్మి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కోతులను సురక్షితంగా అడవులకు తరలించేందుకు సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు. ఖాళీ ప్రదేశాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించేందుకు ప్రజల సహకారం అవసరమని తెలిపారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

# సిరిసిల్లకు కేటీఆర్ చేసింది శూన్యం

- 17 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి ఏం లాభం
- కేకే మహేందర్ రెడ్డి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**




రాజన్న సిరిసిల్ల మున్సిపల్ ఎన్నికల్లో కేటీఆర్ తన ఓటమిని అంగీకరించినట్టేనని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 9 సంవత్సరాలు మంత్రిగా, 17 ఏళ్లు ఎమ్మెల్యేగా కొనసాగిన కేటీఆర్ సిరిసిల్ల అభివృద్ధికి చేసింది శూన్యమని విమర్శించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంపై ప్రజలకు నమ్మకం ఉందని, అందుకే ఇటీవల గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 68 శాతం ప్రజలు మద్దతు ఇచ్చారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరిట ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా నేతన్నలకు ఉపాధి కల్పించేందుకు యార్న్ డిపోలు ఏర్పాటు చేశామని చెప్పారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అవినీతి జరిగిందని, ప్రస్తుతం ప్రజాపాలనలో పారదర్శకంగా ఇళ్లు, రేషన్ కార్డులు అందిస్తున్నామని తెలిపారు. సిరిసిల్ల అభివృద్ధి కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆకునూరి బాలరాజు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బోటి తండాలో ఉపాధి పనుల పరిశీలన

- ప్రతి కూలీకి పని కల్పించడమే లక్ష్యం : సర్పంచ్

**వేద న్యూస్, కారేపల్లి:**



పాత కమలాపురం గ్రామపంచాయతీ పరిధిలోని బోటి తండాలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ తేజవత్ బాబురావు, ఉప సర్పంచ్ బానోత్ స్వాతి పరిశీలించారు. గ్రామంలోని ప్రతి కూలీకి పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కూలీలు ప్రభుత్వం కల్పించిన 100 రోజుల పనిని పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. కార్యక్రమంలో కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అమ్మకు అక్షరమాల ద్వారా వయోజన విద్యాభివృద్ధి



**వేద న్యూస్, మంచిర్యాల:**

- చదువుకు వయసుతో సంబంధం లేదు
- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్

ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మకు అక్షరమాల కార్యక్రమం ద్వారా వయోజన విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ తెలిపారు. హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు నేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని, 15 నుంచి 60 సంవత్సరాల లోపు వారందరూ చదువుకోవాలని సూచించారు. ఉల్లాస్ అక్షరాస్యత కేంద్రాలకు నిరక్షరాస్యులు హాజరై, 100 రోజుల్లో అక్షరాస్యులుగా మారాలని, అక్షర వికాసం పుస్తకంలోని 16 అధ్యాయాలను పూర్తి చేయాలని తెలిపారు. వయోజన విద్య ద్వారా మహిళా సంఘ సభ్యులు కీలక జీవన నైపుణ్యాలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, గ్రామ సర్పంచ్ మిట్టపల్లి రామ్ రెడ్డిలతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు శిరీష, దాసరి శ్యామల, జేడీఎం రామచందర్, ఏపీఎం వెంకటేష్, సీసీలు మోహన్, కృపవర్ణ, రాజమణి, వీఓఏలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవ అవగాహన సదస్సు

**వేద న్యూస్, సిరిసిల్ల:**




మేరా యువభారత్ బీసీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నర్సింగ్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మై భారత్ జిల్లా అధికారి వెంకట రాంబాబు పాల్గొన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేస్తూ 1950 జనవరి 25న ఏర్పాటయ్యిందని, 2011 నుంచి ప్రతి ఏడాది జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువకుడు ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమని పేర్కొన్నారు. కొత్త ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

వేద న్యూస్

ఆదివారం ఫిబ్రవరి 01, 2026

# నేడు వేల్పుగొండలో కుస్తీ పోటీలు

**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో శ్రీ తుంబురేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా నేడు మధ్యాహ్నం 12 గంటలకు సంప్రదాయ కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ సర్పంచ్ నిరుడి దాస్, ఉప సర్పంచ్ సుధాకర్, గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఈ కుస్తీ పోటీలు జరుగుతాయి. కొబ్బరికాయ కుస్తీ నుంచి ఐదు తులాల వెండి కడియం వరకు బహుమతులతో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి మల్లయోధులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కుస్తీ పోటీలను విజయవంతం చేయాలని గ్రామ పెద్దలు, యువజన సంఘాల నాయకులు కోరారు

# నేటి నుంచి పోలీసు యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్ జిల్లా:**

మెదక్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నేటి నుంచి 28వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. ఈ కాలంలో పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని స్పష్టం చేశారు. అలాగే ప్రజల లేదా ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల**



మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ శనివారం పూర్తయ్యింది. ఈ కార్యక్రమాన్ని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆధ్వర్యంలో, మున్సిపల్ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, నోడల్ అధికారులు శ్రీనివాసాచారి, జగన్ మోహన్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారులు లక్ష్మీరాజం, భారతి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్‌లోనే యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- ప్రజావాణిలో ఎన్హెచ్ఆర్సీ, సామాజిక కార్యకర్తల వినతి

**వేద న్యూస్, ఆదిలాబాద్ ప్రతినిధి:**



ప్రభుత్వం ప్రతిపాదించిన యూనివర్సిటీని నిర్మల్ జిల్లాలో కాకుండా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని ఎన్ హెచ్ ఆర్సీ ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నేరడిగొండ మండలంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎన్ హెచ్ ఆర్సీ జిల్లా వైస్ చైర్మన్ రాథోడ్ సందీప్ మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌లో గిరిజన, ఆదివాసీ విద్యార్థులు అధికంగా ఉన్నారని, ఇతర జిల్లాలకు వెళ్లడం వల్ల ఆర్థిక భారం పెరుగుతోందని తెలిపారు. అభివృద్ధిలో వెనుకబడిన ఆదిలాబాద్‌లో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే విద్యాభివృద్ధి వేగవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్స్

- మౌనం వీడి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి
- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు



**వేద న్యూస్, మెదక్:**

మెదక్ జిల్లాలో మహిళలు, బాలికల భద్రత కోసం ఏర్పాటు చేసిన షీ టీమ్స్ జనవరి నెలలో విస్తృతంగా చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన వారిపై 6 ఎఫ్ఐఆర్‌లు, 12 ఈ పెట్టీ కేసులు నమోదు చేశామని చెప్పారు. తూప్రాన్ సబ్‌డివిజన్‌లో 39 మంది, మెదక్ సబ్‌డివిజన్‌లో 65 మంది కలిపి మొత్తం 104 మందిని పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో 44 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలను వేధించినా, వెంబడించినా వెంటనే 100 లేదా షీ టీమ్ వాట్సాప్ నెంబర్ 8712657963 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ముఖ్య కూడళ్లలో సివిల్ డ్రెస్‌లో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారని తెలిపారు. 18 ఏళ్ల లోపు బాలికల వివాహాల సమాచారం ఉంటే 1098కు తెలియజేయాలని, అలాగే అక్రమ రవాణా, మానవ అక్రమ రవాణాపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. షీ టీమ్స్ తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో పని చేస్తున్నాయని తెలిపారు.

# బజార్ హత్నూర్లో 'రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్'

- పాల్గొన్న వ్యవసాయ అధికారులు




**వేద న్యూస్, ఆదిలాబాద్:**

ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండల పరిధిలోని పిప్రి రైతు వేదికలో రైతుల కోసం ఫార్మర్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టాదార్ పాసుబుక్ కలిగిన ప్రతి రైతు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటే 11 అంకెల రైతు ఐడీ నంబర్ జారీ అవుతుందని, ఇది పీఎం కిసాన్, పంట బీమా వంటి కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలన్నింటికీ ప్రామాణికంగా ఉపయోగపడుతుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం రైతులు పట్టాదార్ పాసుబుక్, ఆధార్ కార్డు, ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్ తీసుకురావాలని సూచించారు. రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని, లేదా మీసేవ కేంద్రంలో రూ.15 ఫీజుతో కూడా చేసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కృష్ణపాల్ తో పాటు రైతులు కిరణ్, మడవి లక్ష్మణ్ చంద్రశేఖర్, సోనాబాయి, కోసుబాయి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత అందరి బాధ్యత

- నియమాలు అందరూ పాటించాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- ఘనంగా 'రోడ్డు భద్రతా 2ఖ రన్'




**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:**

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణంలో 2కే రన్ ను ఘనంగా నిర్వహించారు. ఈ పరుగు స్థానిక ఆర్టీఓ కార్యాలయం నుంచి ప్రారంభమై ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు రోడ్డు భద్రతా నినాదాలతో సాగి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం స్టేడియంలో ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెల్మెట్ తప్పనిసరిగా ధరించడం, అతివేగాన్ని నియంత్రించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ప్రతి ఏడాది దేశవ్యాప్తంగా లక్షలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని, విద్యార్థులు, యువత రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, బంధుమిత్రులకు కూడా రహదారి భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు. నెల రోజుల పాటు రవాణా శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు ప్రశంసనీయమని అధికారులను అభినందించారు. అనంతరం 2కే రన్ విజేతలకు బహుమతులు, అతిథులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఉప రవాణా కమిషనర్ రవీందర్ కుమార్, డీవైఎస్ఓ శ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నరేందర్ రాథోడ్, జిల్లా రవాణా అధికారి ఎస్. శ్రీనివాస్, విద్యార్థులు, యువత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తులు ఆహ్వానం

- ఎస్సి విద్యార్థులకు రూ.20 లక్షల స్కాలర్‌షిప్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద 2026 విద్యా సంవత్సరానికి గాను రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన షెడ్యూల్డ్ కులాల (ఎస్సి) విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి డా. వి. రవీందర్ రెడ్డి తెలిపారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యకు ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షల వరకు స్కాలర్‌షిప్‌తో పాటు వీసా, విమాన టికెట్ ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని చెప్పారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, దక్షిణ కొరియా, న్యూజిలాండ్ దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన ఎస్సి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ నేటి నుంచి మార్చి 31 వరకు కొనసాగుతుందని, ఆసక్తి గల విద్యార్థులు www.telangana.epass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో శనివారం వాహనదారులకు రోడ్డు భద్రత నిబంధనలపై రుద్రూర్ ఎస్సై సాయన్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సాయన్న మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా ప్రయాణించరాదని, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భద్రతా నిబంధనల పాటింపు కీలకమని తెలిపారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ ధరించి వాహనాలు నడుపుతున్న ద్విచక్ర వాహనదారులను ఎస్సై సాయన్న శాలువాలతో సన్మానించారు.

# వెంకటేశ్వరస్వామి కల్యాణంలో జీఎంఆర్ దంపతులు



**వేద న్యూస్, దేవరకద్ర:**

దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట మండలం కనాయపల్లి వెంకట గిరిగుట్టపై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం నిర్వహించిన స్వామివారి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**వేద న్యూస్, ఎల్లారెడ్డిపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్ సమీపంలో సిరిసిల్లకామారెడ్డి ప్రధాన రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల ప్రకారం, వెంకటాపూర్ గ్రామానికి చెందిన చాట్ల సాయికుమార్ ద్విచక్ర వాహనంపై మాచారెడ్డికి తన భార్య, పిల్లలను తీసుకురావడానికి బయలుదేరాడు. అదే సమయంలో అదే గ్రామానికి చెందిన గొట్టే శశిధర్ (25) ఎల్లారెడ్డిపేటలో బ్యాంకు పనిమీద వెళ్తూ లిఫ్ట్ కోరడంతో ఇద్దరూ కలిసి పల్సర్ బైక్‌పై ప్రయాణించారు. శ్రీ చైతన్య స్కూల్ సమీపానికి చేరుకున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన షిఫ్ట్ డిజైర్ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకొని గాయపడిన వారిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వేద న్యూస్

ఆదివారం ఫిబ్రవరి 01, 2026

# తల్లిదండ్రుల స్మృతిలో జామ మస్జిద్‌కు గేట్ విరాళం



**వేద న్యూస్, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామంలోని జామ మస్జిద్‌కు గేట్ లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, గ్రామానికి చెందిన మహమ్మద్ హైమద్ హుస్సేన్ సోదరులు తమ తల్లిదండ్రుల స్మృతిగా మస్జిద్‌కు గేట్ విరాళంగా అందజేశారు. వారి తండ్రి కీ.శే రాజమహమ్మద్, తల్లి కీ.శే. అంకూస్ బీ పేర్లపై గేట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా మస్జిద్ ఇమామ్ ముంషాద్ అలీ మాట్లాడుతూ.. ఇటువంటి సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం అని అన్నారు. మస్జిద్ అభివృద్ధికి ఇతరులు కూడా ముందుకు రావాలని, గేట్ విరాళం ఇచ్చిన దాతలకు అల్లా ఆశీస్సులు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ హైమద్ హుస్సేన్, ఆఫ్రిద్, అబ్దుల్ ఖుర్షీద్ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం కప్ ఎంపిక పోటీలు ప్రారంభం



**వేద న్యూస్, మరిపెడ:**

మరిపెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల ఎంపికలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాల్ రెడ్డి చైర్మన్‌గా, మండల విద్యాశాఖ అధికారి అనితాదేవి కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, కరాటే, చెస్, ఫుట్‌బాల్ క్రీడలకు సంబంధించిన ఎంపికలు నిర్వహించినట్లు పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఈ. అనంతరావు, ఎంపీడీఓ ప్రతినిధి రామోజీ తెలిపారు. శారీరక ఆరోగ్యం ఉన్నప్పుడే మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని, క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు చురుకుదనాన్ని పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు బయగాని రామ్మోహన్, సీఎం కప్ మండల క్రీడల ఇన్‌చార్జ్ రాజకుమారి, సీనియర్ పీడీ వంగా రవి, పీడీలు రమాదేవి, రాంబాబు, స్వప్న, శ్రీకాంత్, శివ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది రాజా, క్రీడాకారులు పాల్గొన్నారు.

# కాలువ శుభ్రతలో పాల్గొన్న సర్పంచ్

**- ప్రజల ప్రశంసలు**



**వేద న్యూస్, కారేపల్లి:**

బొక్కలతండ గ్రామంలో ప్రజా సేవకు అర్థం చెబుతూ సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు ఆదర్శంగా నిలిచారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడమే లక్ష్యంగా ఆయన స్వయంగా మురుగు కాలువల శుభ్రత పనుల్లో పాల్గొన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మురుగు నీరు నిల్వ ఉండటంతో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యగా గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి కాలువల్లో పేరుకుపోయిన మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కేవలం పర్యవేక్షణకే పరిమితం కాకుండా స్వయంగా పనుల్లో పాల్గొనడం గ్రామస్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ నీళ్ల ట్యాంకర్ ద్వారా ఫోర్స్‌గా నీటిని వదిలి డ్రైనేజీలను పూర్తిగా కడిగి శుభ్రం చేశారు. దీనివల్ల కాలువల్లో నీరు సాఫీగా ప్రవహించడంతో పాటు దోమల పెంపకం, ఆరోగ్య సమస్యలకు చెక్ పడింది. సర్పంచ్ చూపిన చొరవ, పనిపట్ల నిబద్ధతను గ్రామస్తులు ప్రశంసిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# అమలులో ఎన్నికల ప్రవర్తనా నియమావళి

- మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి
- ఎస్ఐ నరేష్ రెడ్డి



**వేద న్యూస్, చొప్పదండి:**

మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉందని చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పౌరులు, అభ్యర్థులు మరియు వారి అనుచరులు ఎన్నికల మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసే ఉద్దేశంతో డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ చేయడం లేదా స్వీకరించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, అటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల శాంతి భద్రతలకు భంగం కలిగించే ఎలాంటి ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. బెల్ట్ షాపులు నిర్వహించడం, మాదక ద్రవ్యాల వినియోగం లేదా విక్రయం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నారు. అలాగే సోషల్ మీడియా, వాట్సాప్ వంటి మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు చేయడం లేదా ప్రజా శాంతికి భంగం కలిగించే పోస్టులు పెట్టిన వారితో పాటు సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించడం, ప్రచార వాహనాలు లేదా స్పీకర్లు వినియోగించడం ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని, కాబట్టి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ నరేష్ రెడ్డి సూచించారు.

# పోగొట్టుకున్న ఫోన్ అప్పగించిన ఎస్ఐ



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండల కేంద్రంలోని రాయకూర్ గ్రామానికి చెందిన లాచినె పద్మ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లు రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై స్పందించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్‌ను రికవరీ చేశారు. శనివారం రుద్రూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సాయన్న బాధితురాలు పద్మకు మొబైల్ ఫోన్‌ను అధికారికంగా అప్పగించారు. మొబైల్ ఫోన్ తిరిగి లభించడంతో బాధితురాలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు

# దేవత మూర్తులకు పాచి బండ్ల ఊరేగింపు

**- ఘనంగా తుమ్మరీశ్వర స్వామి ఉత్సవాలు**



**వేద న్యూస్, టేక్మాల్:**

మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం వెలుపుగొండ గ్రామంలో కాకతీయుల కాలంలో నిర్మితమైన తుమ్మరీశ్వర స్వామి దేవాలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు దేవత మూర్తులకు పాచి బండ్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కాకతీయుల కాలం నాటి ఈ దేవాలయం చారిత్రక ప్రాముఖ్యత కలిగినదిగా శాసనాలు సూచిస్తున్నాయి. ఆలయ బాహ్య ప్రాంగణంలో ఉన్న శిల్ప స్తంభాలు, లక్ష్మీ, మహంకాళి, సరస్వతి దేవి మూర్తులు, తల్లి, బిడ్డ విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శనివారం మాఘశుద్ధ ద్వాదశి సందర్భంగా ఉదయం రంగంపేట్ మహారాజ్ మాధవనంద సరస్వతి స్వామి ఆలయానికి విచ్చేసి దేవత మూర్తులకు రుద్రాభిషేకం, కలశ స్థాపన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం పాచి బండ్ల ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. నిత్య అన్నదానం, భజనలు, సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడిందని ఆలయ పూజారి శ్రీ రవికోటి వైద్య రామశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరుడి దాసు, ఉప సర్పంచ్ ఎంపీ సుధాకర్, గ్రామ పాలకవర్గ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, యువజన సంఘాల నాయకులు, వివిధ గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాధ్యం



- ప్రతి పౌరునికి నాణ్యమైన విద్య అందించాలి
- జాతీయ సదస్సులో ఆచార్య హర గోపాల్

**వేద న్యూస్, హైదరాబాద్:**

విద్యారంగ అభివృద్ధితోనే వికసిత్ భారత్ సాధ్యమని ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, సిటీ కాలేజీ పూర్వ విద్యార్థి ఆచార్య హర గోపాల్ అన్నారు. సిటీ కాలేజీ రాజనీతి శాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్లు సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి తగిన బడ్జెట్ కేటాయింపులు చేయకపోతే "వికసిత్ భారత్" లక్ష్యం సాకారం కాదన్నారు. ప్రతి పౌరునికి నాణ్యమైన విద్య, మెరుగైన పాఠ్యప్రణాళికలు, ఉన్నత స్థాయి పరిశోధనలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మౌలిక వసతుల కల్పన మాత్రమే అభివృద్ధి కాదని, ప్రశ్నించే తత్వం పెంపొందినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ప్రశ్నలు అడిగే విద్యార్థులు, సమాధానాల కోసం ప్రయత్నించే యువత ఉన్నప్పుడే వికసిత్ భారత్ సాధ్యమని, ప్రశ్నలను అణిచివేయడం ద్వారా అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. మానవీయ విలువలు, సాంకేతిక అభివృద్ధి రెండూ సమానంగా పెరిగినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సదస్సు కన్వీనర్ డా. ఎల్. తిరుపతి సదస్సు నివేదికను సమర్పించారు. వివిధ విశ్వవిద్యాలయాల నుండి అధ్యాపకులు, విద్యార్థులు పత్రాలు సమర్పించారని తెలిపారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నుండి ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొనగా, ప్రతిభావంతులైన విద్యార్థులతో ప్యానెల్ డిస్కషన్ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. విప్లవ దత్ శుక్లా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలి

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



ఉర్సు రంగసముద్రం చెరువు అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పరిధిలోని ఉర్సు రంగసముద్రం చెరువు పనులను ఇరిగేషన్, రెవెన్యూ, కుడా, పబ్లిక్ హెల్త్ జీడబ్ల్యూఎంసి ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి క్షేత్ర స్థాయి లో పర్యటించి సమర్థవంతం గా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అమృత్ 2.0 పథకంలో భాగంగా వరంగల్ పరిధిలోని ఉర్సు రంగసముద్రం చెరువు ఎంపిక కావడం జరిగినందున ఫోర్ షోర్ బండ్ అభివృద్ధి పనులను చేపట్టుటకు ప్రతిపాదనలు పూర్తి చేసి పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ విభాగం వారు టెండర్ పిలిచి నందున సంబంధిత అభివృద్ధి పనులను కాంట్రాక్టర్ వెంటనే మొదలు పెట్టేలా చూడాలని అన్నారు. అట్టి పనులను గ్రౌండ్ చేయడానికి ఇంజనీరింగ్, రెవెన్యూ, కుడా, పబ్లిక్ హెల్త్ జీ డబ్ల్యూ ఎం సి ఇంజనీరింగ్ విభాగాల అధికారులు సమన్వయం తో పని చేయాలని వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా సిపిఓ అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, ఇరిగేషన్ డిఈ మధుసూదన్, పబ్లిక్ హెల్త్ డిఈ మొజామిల్, బల్దియా డిఈ రంగారావు, ఏఈ సౌజన్య, ఇరిగేషన్ ఏఈ వేణుగోపాల్ రెవిన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మానసిక ప్రశాంతతకు క్రీడలు అవసరం

**వేద న్యూస్, చొప్పదండి / రామడుగు:**



వ్యక్తి జీవితంలో క్రీడలు ఎంతో అవసరమని, వీటి ద్వారా కండపుష్టితో పాటు శారీరక, మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవచ్చని రామడుగు మండల ఇంచార్జి ఎంపీడీవో శ్రావణ్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. స్థానిక సర్పంచ్ ఎండీ మోయిజ్‌తో పాటు వివిధ గ్రామాల ప్రతినిధుల సమక్షంలో పోటీలు ప్రారంభమయ్యాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

# ముగిసిన సీఎం కప్ పోటీలు

**వేద న్యూస్, వీర్నపల్లి:**

**- విజేతలకు బహుమతులు అందజేసిన ఏంపిడిఓ శ్రీలేఖ**



రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు విజయ వంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహిం చిన బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సంద ర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారని తెలిపారు. సీఎం కప్ వంటి పోటీలు గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.ఈ పోటీల్లో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ , ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, క్రీడా నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో రోడ్డు భద్రత మెగా ర్యాలీ



- పాల్గొన్న 2 వేల మంది విద్యార్థులు
- ప్రమాదాలపై అవగాహన
- రోడ్డు ప్రమాదాలు లేని సమాజాన్ని నిర్మించాలి
- అడిషనల్ ఎస్పీ చంద్రయ్య

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో మెగా రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించారు. జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజున పట్టణంలోని వివిధ ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 2వేల మంది విద్యార్థులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. బతుకమ్మ ఘాట్ నుంచి పాత బస్టాండ్ మీదుగా అంబేద్కర్ చౌక్ వరకు జరిగిన ర్యాలీలో విద్యార్థులు రోడ్డు భద్రతపై ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాముఖ్యత, మద్యం సేవించి వాహనం నడపకూడదని, మొబైల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా అధికారి వి. లక్ష్మణ్ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు ఇతర వాహనాలు నడిపేవారు సీట్‌బెల్ట్ ఉపయోగించాలని, అతివేగాన్ని నివారించాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు విద్యార్థులేనని, రోడ్డు ప్రమాదాలు లేని సమాజాన్ని నిర్మించడంలో వారు ఆదర్శంగా నిలవాలని అన్నారు. డీఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ.. రోడ్డు మనది.. భవిష్యత్తు మనది అనే నినాదం ర్యాలీ సారాంశాన్ని ప్రతిబింబించిందన్నారు. ర్యాలీ అనంతరం రవాణా శాఖ అధికారులు విద్యార్థులతో పాటు వాహనదారులతో రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సహాయ మోటార్ వాహన తనిఖీ అధికారులు రజని, పృథ్వీరాజ్ వర్మ, సిబ్బంది రమ్య, సౌమ్య, ప్రశాంత్, ఎల్లేష్‌తో పాటు సీఐ కృష్ణ, పట్టణ ఎస్ఐలు పాల్గొన్నారు.

# పోలీసులు మీకోసం

- ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం
- సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- బోథ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గురుస్వామి



**వేద న్యూస్, ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి:**

సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో శనివారం అవగాహ న సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోథ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గురుస్వామి, బజార్ హత్నూర్ ఎస్సై సంజయ్ పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇటీవల నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియాలో వచ్చే అనుమానాస్పద లింకుల ద్వారా మోసాలు పెరుగుతున్నాయని హెచ్చరించారు. వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ సమాచారం అపరిచితులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైన వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. బలమైన పాస్‌వర్డులను ఉపయోగించడం, వాటిని తరచూ మార్చుకోవడం, అనుమానాస్పద ఈమెయిల్స్, మెసేజ్‌లలోని లింకులను ఓపెన్ చేయకూడదని సూచించారు. సైబర్ మోసాలపై పోలీసులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణకాంత్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మురళీ మోహన్, మాజీ సర్పంచ్ కవిత రాఘన్ రెడ్డి, ఏనుగు లక్ష్మారెడ్డి, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# లింగం బంజర శివాలయ స్థలంపై విచారణ



**వేద న్యూస్, కారేపల్లి:**

ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని లింగం బంజర గ్రామంలో ఉన్న శ్రీ రామలింగేశ్వర స్వామి స్థలంపై శనివారం దేవాదా య, రెవెన్యూ, గ్రామ పంచాయతీ శాఖ అధికారులు సంయుక్తంగా విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయంలో దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి వేణు గోపాలాచార్యులు మాట్లాడుతూ.. రికార్డుల ప్రకారం దేవస్థానానికి మొత్తం 3.08 ఎకరాల భూమి ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆలయం కేవలం 10 గుంటల స్థలంలో మాత్రమే ఉందన్నారు. విశ్వనాథపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 362లో మొత్తం 11.33 ఎకరాల భూమి ఉండగా, అందులో దేవాలయానికి సంబంధించిన 3.08 ఎకరాలు ఉన్నట్లు పేర్కొన్నారు. రికార్డుల మేరకు శివాలయ భూమికి కొలతలు వేసి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ శాఖను కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలో సర్వేయర్ వి.కిరణ్ కుమార్, స్థానిక జీపీఓ రాందాస్, గ్రామస్తులు, సమీప భూముల యజమానులతో కలిసి స్థలాన్ని పరిశీలించినట్లు వెల్లడించారు. శివాలయ భూమి హద్దులు పూర్తిగా గుర్తించే వరకు సర్వే నంబర్ 362లోని 11.33 ఎకరాల భూమిలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వవద్దని గ్రామ పంచాయతీ అధికారులను కోరినట్లు ఈఓ తెలిపారు

# వర్ధన్నపేట మున్సిపాలిటీలో గెలుపు కాంగ్రెస్ దే



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

- వర్ధన్నపేట అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం
- 12వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీ గెలిపించాలి
- ముఖ్య నాయకులతో విస్తృత సమావేశంలో ఎమ్మెల్యే నాగరాజు, జిల్లా అధ్యక్షుడు అయూబ్

వర్ధన్నపేట టౌన్ పరిధిలోని 12 వార్డుల ముఖ్య నాయకులతో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట పట్టణ అభివృద్ధి, కొనసాగుతున్న ప్రభుత్వ పనులు, ప్రజా సమస్యలు, అలాగే మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు వర్ధన్నపేట పట్టణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని, ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కూడా విఫలమయ్యాయని తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వర్ధన్నపేటలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం, విద్య, సాగునీరు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. వర్ధన్నపేట పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయడం ద్వారా పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని, సబ్ జైలు నిర్మాణం వల్ల ప్రాంతానికి అవసరమైన పరిపాలనా సౌకర్యాలు మరింత బలోపేతం అవుతాయని, రూ.200 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ విద్యకు కొత్త ఊపిరి లభిస్తుందని, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని వర్ధన్నపేట కోనారెడ్డి పేట చెరువు ఫీడర్ ఛానల్ మరమ్మతులు పూర్తయితే రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, సుమారు రూ.20 కోట్ల రూపాయల నిధులతో మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యం వంటి అభివృద్ధి పనులు విస్తృతంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఈ అభివృద్ధి పనులన్నీ కేవలం నేటి అవసరాలను మాత్రమే కాకుండా వర్ధన్నపేట భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేపడుతున్నవేనని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నదే కాంగ్రెస్ పార్టీ యొక్క ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు. గత పాలకులు వర్ధన్నపేట పట్టణాన్ని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజల కష్టాలు, అవసరాలను అర్థం చేసుకొని నిజాయితీగా పని చేస్తోందని అన్నారు. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో అభివృద్ధిని చూపిస్తున్నది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమేనని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలు వర్ధన్నపేట పట్టణ భవిష్యత్తును నిర్ణయించే కీలక ఎన్నికలని పేర్కొంటూ, అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలంటే ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. ప్రజల కోసం పని చేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పార్టీ శ్రేణులు, 12 వార్డుల నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వరద రాజేశ్వర్ రావు, టిపిసిసి లీగల్ సెల్ వైస్ ఛైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు చిటూరి రాజు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జీలు, 12 వార్డుల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల హక్కుల కోసం బిజెపి రాజీలేని పోరాటం

- పెండింగ్ డీఏ, పీఆర్సీ లను తక్షణమే ప్రకటించాలి
- రిటైర్మెంట్ ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలను విడుదల చేయాలి
- తపస్ నూతన సంవత్సర క్యాలెండర్ -2026ఆవిష్కరణలో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

**వేద న్యూస్, హైదరాబాద్ :**




హైదరాబాద్ నగరంలోని విద్యానగర్ లో ఉన్న తపస్ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను బిజెపి టీచర్స్ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య శనివారం సహచర ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మాట్లాడుతూ, తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పనిసరిగా పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. గత ఏడాది కాలంగా ప్రజాక్షేత్రంలోనూ, శాసనసభతో పాటు శాసనమండలిలోనూ బిజెపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలుమార్లు స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలను తీసుకెళ్లామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల వంటి కీలక అంశాలపై ఇటీవల హైదరాబాద్ ఇందిరా పార్కులో మహాధర్నా నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, మున్ముందు మరింత తీవ్ర స్థాయిలో ఉద్యమాలు చేపట్టి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి బిజెపి అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ మల్క హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర అధ్యక్షులు వోడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్యతో పాటు తపస్ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ స్మైల్ నిరంతర ప్రక్రియ

- నెల రోజుల వ్యవధిలో 81 మంది బాలల రక్షణ
- 69 మందిని తల్లిదండ్రులకు అప్పగింపు
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్




**వేద న్యూస్, మెదక్:**

రాష్ట్రవ్యాప్తంగా జనవరి 1 నుంచి అమలులోకి వచ్చిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం మెదక్ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా కొనసాగిందని జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నెల రోజుల వ్యవధిలో జిల్లాలో మొత్తం 81 మంది బాలలను రక్షించామని చెప్పారు. వీరిలో 69 మందిని తల్లిదండ్రులకు అప్పగించగా, మిగిలిన 12 మందిని సంరక్షణ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై 52 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 6 మంది బాలలకు పాఠశాలల్లో ప్రవేశం కల్పించడం అభినందనీయమని అన్నారు. బాలల బాల్యం బడుల్లో గడవాలన్నదే ఈ కార్యక్రమ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ నిరంతర చర్యలు చేపడుతుందని అదనపు ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏహెచ్‌టీయూ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, సీడబ్ల్యూసీ ప్రతినిధులు, లేబర్, ఎడ్యుకేషన్ శాఖ అధికారులు, ఎన్జీవోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో భారీగా డ్రగ్స్ స్వాధీనం

**వేద న్యూస్ హైదరాబాద్ :**




శంషాబాద్ విమానాశ్రయంలో డీఆర్ఐ అధికారులు శనివారం మధ్యాహ్నం భారీగా విదేశి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేసిన అధికారులు వారి వద్ద నుంచి రూ. 9.5 కోట్ల విలువైన 27 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ట్రాలీ బ్యాగుల్లో ఉంచి తరలిస్తుండగా పట్టుకున్నారు. నలుగురు విదేశాల నుంచి వచ్చిన నలుగురితో పాటు గంజాయిని తీసుకు వెళ్లేందుకు వచ్చిన మరో ముగ్గురిని డీఆర్ఐ అధికారులు అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఆన్లైన్ ఎర్లింగ్ అనగానే ఆశపడొద్దు

**వేద న్యూస్ హైదరాబాద్ :**

ఆన్‌లైన్ మోసాలు రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడానికి తెలంగాణ పోలీస్ కీలక హెచ్చరికలు జారీ చేసింది. "ఆన్‌లైన్ ఎర్లింగ్" అంటూ వచ్చే మెసేజ్‌లు, లింకులు చూసి ఆశపడొద్దని, అవే సైబర్ నేరగాళ్ల ఉచ్చులని పోలీసులు స్పష్టం చేశారు. ఎర్లింగ్ యాప్స్ పేరుతో భద్రం లేని లింకులు పంపించి, నకిలీ ఆఫర్లు చూపిస్తూ ప్రజలను మోసపుచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. "మీకు రూ.8,000 రివార్డ్ వచ్చింది", "ఇప్పుడే క్లిక్ చేయండి" వంటి సందేశాలు వస్తే వెంటనే అనుమానం వ్యక్తం చేయాలని సూచించారు. తెలియని లింకులను క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం వల్ల బ్యాంక్ ఖాతాలు ఖాళీ కావడం, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కావడం వంటి ప్రమాదాలు ఉన్నాయని హెచ్చరించారు. ఎలాంటి ఆన్‌లైన్ ఆఫర్ అయినా నిజమా కాదా ముందుగా నిర్ధారించుకోవాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని, అవసరమైతే జాతీయ సైబర్ నేరాల హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలంగాణ పోలీసులు పిలుపునిచ్చారు. ప్రజల అప్రమత్తతే సైబర్ నేరాలపై ప్రధాన ఆయుధమని పోలీసులు స్పష్టం చేశారు.



# వెలుగులోకి వినుకొండ మున్సిపాలిటీలో అవినీతి

- ఆదాయాధికారిపై అసమాన ఆస్తుల కేసు నమోదు
- దర్శి, నరసరావుపేట, సత్తెనపల్లి కేంద్రంగా సోదాలు
- భారీ స్థాయిలో ఆస్తులు గుర్తించిన ఏసీబీ

**అమరావతి, వేద న్యూస్:**

ఆంధ్రప్రదేశ్‌లో మరో అవినీతి ఉదంతం వెలుగులోకి వచ్చింది. వినుకొండ మున్సిపాలిటీ ఆదాయాధికారి, అలాగే ప్రకాశం జిల్లా దర్శి మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న యడల మహేశ్వరరావుపై అసమాన ఆస్తుల కేసు నమోదు చేసినట్లు ఆంధ్రప్రదేశ్ అవినీతి నిరోధక శాఖ ప్రకటించింది. అవినీతి నిరోధక శాఖ అధికారులు దర్శి, నరసరావుపేట, సత్తెనపల్లి ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో నిందితుడి పేరుతో పాటు అతని తల్లి, భార్య, కుమారుడి పేర్లపై నమోదు చేసిన మొత్తం తొమ్మిది ఇళ్ల స్థలాలు, రెండు నివాస ఫ్లాట్లు, సుమారు 0.89 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా నగదు రూపంలో సుమారు రూ.2.60 లక్షలు, బ్యాంకు నిల్వలు రూ.55 వేల వరకు, సుమారు 729 గ్రాముల బంగారం, 9.275 కిలోల వెండి, ఒక కారు, మూడు మోటార్ సైకిళ్లు, విలువైన గృహోపకరణాలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. యడల మహేశ్వరరావు 1998లో మున్సిపల్ పరిపాలన శాఖలో కారుణ్య నియామకం కింద బిల్ కలెక్టర్‌గా సత్తెనపల్లి మున్సిపాలిటీలో ఉద్యోగంలో చేరారు. అనంతరం



జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది నెల్లూరు, చిలకలూరిపేట, నరసరావుపేట మున్సిపాలిటీల్లో పని చేశారు. తరువాత సీనియర్ అసిస్టెంట్‌గా, ఆపై ఆదాయాధికారిగా పదోన్నతి పొంది వినుకొండ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా దర్శి మున్సిపాలిటీకి ఇన్‌చార్జ్ కమిషనర్‌గా కూడా బాధ్యతలు చేపడుతున్నారు. నిందితుడి ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన అంశంపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతున్నట్లు అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలిపారు. ఈ కేసు రాష్ట్రంలో అవినీతిపై ప్రభుత్వ కఠిన వైఖరికి మరో ఉదాహరణగా నిలుస్తోందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

# మొదలైన కింగ్ పిన్స్ వేట



**వేద న్యూస్ విజయవాడ :**

- అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ ముజామిల్ అరెస్ట్
- స్మగ్లర్లువారి వెనుక ఉన్నవారిపై ఉక్కు పాదం కూటమి ప్రభుత్వం
- యాంటి రెడ్ శాండర్స్ టాస్క్ ఫోర్స్‌కు ఉప ముఖ్యమంత్రి ప్రశంసలు

ఎర్రచందనం అక్రమ రవాణాపై కఠిన చర్యలు చేపట్టాలన్న నిర్ణయాన్ని ఎన్. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకుంది. ఈ క్రమంలో కింగ్ పిన్స్ వేట ప్రారంభమై తొలి విజయం సాధించింది. అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్ మొహమ్మద్ ముజామిల్‌ను యాంటి రెడ్ శాండర్స్ స్మగ్లింగ్ టాస్క్ ఫోర్స్ అరెస్టు చేసింది. ముజామిల్ ఎర్రచందనం దుంగలను లైసెన్స్ పేరుతో అక్రమంగా చైనాకు తరలించేవాడని విచారణలో తేలింది. శేషాచలం నుంచి బెంగళూరు మీదుగా రవాణా నిర్వహించేవాడని అధికారులు వెల్లడించారు. అతనిపై పలు కేసులు ఉండగా, సుమారు ఎనభై ఏడు శాతం కేసుల్లో శిక్షలు ఖరారైనప్పటికీ తప్పించుకుని తిరుగుతున్నాడని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి, అటవీపర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా శనివారం ఉదయం చిత్తూరునాయుడుపేట జాతీయ రహదారిపై అడిషనల్ ఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలోని బృందం ముజామిల్‌ను పట్టుకుంది. అతనికి చైనాలోని జైమెన్ టాంగాంగ్ ఫాంగ్ ట్రేడ్ కంపెనీతో సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# ప్రపంచ హిజాబ్ దినోత్సవం
## ఎంపిక హక్కు, గుర్తింపు, గౌరవంపై చర్చ

- మహిళల స్వేచ్ఛ అంటే ఏంటి అనే ప్రశ్న
- మతపరమైన గుర్తింపుకు గౌరవం అవసరం
- భిన్నత్వాన్ని అంగీకరించడమే నిజమైన సమానత్వం

**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచ హిజాబ్ దినోత్సవం మహిళల స్వేచ్ఛ, మతపరమైన గుర్తింపు, వ్యక్తిగత ఎంపిక హక్కులపై ప్రపంచాన్ని ఆలోచనకు నడిపించే రోజు. హిజాబ్ అనేది కేవలం ఒక వస్త్రం కాదు. అది అనేక మహిళలకు వారి విశ్వాసం, సంస్కృతి, వ్యక్తిత్వానికి ప్రతీక. ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలు, హిజాబ్‌ను ఒక వివాదంగా కాకుండా, ఒక ఎంపికగా చూడాలన్న సందేశాన్ని బలంగా వినిపిస్తున్నాయి.

మహిళల స్వేచ్ఛ గురించి మాట్లాడేటప్పుడు, ఆ స్వేచ్ఛ ఎవరి నిర్వచనంలో ఉండాలన్న ప్రశ్న తలెత్తుతుంది. ఒక మహిళ ఏం ధరించాలి, ఏం ధరించకూడదు అన్నది ఆమె నిర్ణయమే కావాలా? లేక సమాజం, రాజకీయం, లేదా ఆధిపత్య ఆలోచనలే నిర్ణయించాలా? ప్రపంచ హిజాబ్ దినోత్సవం ఈ ప్రశ్నను నేరుగా ఎదురుపెడుతుంది. హిజాబ్ ధరించడం ఒకరి ఎంపిక అయితే, దానిని గౌరవించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్న భావనను ఇది ముందుకు తెస్తుంది.

నేటి ప్రపంచంలో మహిళల శరీరంపై, వారి వస్త్రధారణపై తీర్పులు చెప్పే ధోరణి ఇంకా కొనసాగుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో హిజాబ్‌ను బలవంతంగా మోపుతున్నారన్న విమర్శలు వినిపిస్తే, మరికొన్ని సందర్భాల్లో హిజాబ్‌ను నిషేధించడం కూడా జరుగుతోంది. ఈ రెండింటి మధ్య మహిళ స్వరం ఎక్కడ ఉందన్నదే అసలైన ప్రశ్న. హిజాబ్ దినోత్సవం మహిళకు తన విశ్వాసాన్ని అనుసరించే హక్కు ఉందని, అదే సమయంలో ఆమెకు ప్రశ్నించే స్వేచ్ఛ కూడా ఉందని గుర్తుచేస్తుంది.

మతపరమైన గుర్తింపు అనేది వ్యక్తి వ్యక్తిత్వంలో భాగం. ఒకరి దుస్తులు, ఆచారాలు, విశ్వాసాలు వారి గౌరవంతో ముడిపడి ఉంటాయి. వాటిని అవమానించడం, నిరాకరించడం సమాజంలో విభజనను పెంచుతుంది. భిన్నత్వాన్ని అంగీకరించడమే ప్రజాస్వామ్య సమాజానికి బలం. ఈ దినోత్సవం "అందరూ ఒకేలా ఉండాలి" అన్న భావనకు ప్రత్యామ్నాయంగా, "అందరికీ సమాన గౌరవం ఉండాలి" అన్న ఆలోచనను ముందుకు తెస్తుంది.

హిజాబ్‌పై జరిగే చర్చలు కేవలం మత పరిమితుల్లోనే ఉండవు. అవి మహిళా హక్కులు, విద్య, ఉపాధి, ప్రజా స్థలాల్లో భాగస్వామ్యం వంటి అంశాలతో ముడిపడి ఉంటాయి. హిజాబ్ ధరించిన మహిళలను చదువు, ఉద్యోగం, సామాజిక అవకాశాల నుంచి దూరం చేయడం స్వేచ్ఛకు విరుద్ధం. ఒక మహిళ తన గుర్తింపుతోనే సమాజంలో ముందుకు సాగగలగాలి అన్నదే ఈ దినోత్సవం చెప్పే సందేశం.

యువతలో ఈ అంశంపై అవగాహన పెరగడం చాలా అవసరం. సోషల్ మీడియా కాలంలో అభిప్రాయాలు వేగంగా తీర్పులుగా మారిపోతున్నాయి. హిజాబ్‌ను చూసి ఒక వ్యక్తి స్వభావాన్ని నిర్ణయించడం ప్రమాదకర ధోరణి. అవగాహన, సంభాషణ, పరస్పర గౌరవమే ఈ అపోహలను తొలగించగల మార్గాలు. ప్రపంచ హిజాబ్ దినోత్సవం అలాంటి సంభాషణలకు ఒక వేదిక.

ఈ రోజు అసలైన ఉద్దేశ్యం ఎవరికైనా హిజాబ్ ధరించమని చెప్పడం కాదు. అలాగే, హిజాబ్‌ను విస్మరించమని చెప్పడం కూడా కాదు. మహిళకు తన ఎంపికపై సంపూర్ణ హక్కు ఉండాలన్నదే దీని సారాంశం. స్వేచ్ఛ అంటే ఒకే విధంగా ఉండటం కాదు, భిన్నంగా ఉండే హక్కును అంగీకరించడమే.

ప్రపంచ హిజాబ్ దినోత్సవం మన సమాజానికి ఇచ్చే ప్రధాన సందేశం స్పష్టంమహిళల స్వేచ్ఛను మాటల్లో కాకుండా, ఆచరణలో గౌరవించాలి. దుస్తుల ఆధారంగా కాదు, వ్యక్తిత్వం ఆధారంగా మహిళలను చూడగలిగినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది.

# బడ్జెట్ దిశ మారుతుందా?
## పదేళ్ల ప్రాధాన్యాల్లో భారీ మార్పులు!



**వేద న్యూస్ డెస్క్:**

యూనియన్ బడ్జెట్ 2026-27పై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. గత పదేళ్లలో కేంద్ర బడ్జెట్ ప్రాధాన్యాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. 2016 ప్రాంతంలో సంక్షేమ పథకాలు, గ్రామీణ అభివృద్ధి కీలక అంశాలుగా ఉండగా, తర్వాత ప్రభుత్వం రక్షణ, తయారీ, మౌలిక వసతులు, క్యాపిటల్ వ్యయం వంటి రంగాలవైపు దృష్టి మళ్లించింది. కరోనా అనంతరం ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు ఖర్చులను పెంచి, రోడ్లు, రైల్వేలు, ఎయిర్‌పోర్టులు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయించింది.

అదే సమయంలో సబ్సిడీలు, కొన్ని సంక్షేమ ఖర్చులను క్రమంగా నియంత్రించే ప్రయత్నం చేసింది. క్యాపిటల్ వ్యయం పెంపు ఈ దశాబ్దంలో అత్యంత పెద్ద మార్పుగా నిలిచింది. 2016లో సుమారు రూ.4 లక్షల కోట్లుగా ఉన్న మూలధన వ్యయం, 2025 నాటికి రూ.11 లక్షల కోట్లకు చేరింది. రైల్వేలు, హైవేలు, రక్షణ రంగాలకు అధిక కేటాయింపులు చేసి ఉపాధి సృష్టి, ప్రాంతీయ అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుంది కేంద్రం. డిజిటల్ రంగం, స్టార్టప్ వ్యవస్థ, అంతరిక్ష రంగాలకు కూడా గతంతో పోలిస్తే ఎక్కువ ప్రాధాన్యం లభించింది. అయితే ఆరోగ్యం, విద్య రంగాల్లో మొత్తాలు పెరిగినా జీడీపీ వాటాలో పెద్దగా మార్పు కనిపించలేదు.

వ్యవసాయ కేటాయింపులు కూడా స్థిరంగానే కొనసాగాయి. బడ్జెట్‌లో నిధులు కేటాయించినంత మాత్రాన ప్రాజెక్టులు వేగంగా పూర్తవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భూసేకరణ సమస్యలు, రాష్ట్రాలతో సమన్వయ లోపం, టెండర్ ఆలస్యం, కోర్టు వివాదాలు వంటి అంశాలు అభివృద్ధి పనులకు అడ్డంకులుగా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో విడుదలైన నిధులు పూర్తిగా వినియోగం కాకపోవడం కూడా పెద్ద సమస్యగా నిలుస్తోంది. పాలసీ కంటే అమలు యంత్రాంగంలోని బలహీనతలే దీనికి కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రతీ బడ్జెట్‌లో పెద్ద హామీలు ఇచ్చినా వాటి అమలు ఆలస్యం కావడం సాధారణమైందని విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్థిక పరిమితులు, ఎన్నికల షెడ్యూల్, విధాన మార్పులు, అంతర్జాతీయ పరిస్థితులు వంటి అంశాలు ప్రణాళికలను ప్రభావితం చేస్తున్నాయి. కొన్ని పథకాలు పైలట్ దశలోనే నిలిచిపోతుండగా, మరికొన్నివి పూర్తి స్థాయి అమలుకు సరైన ప్రణాళిక లేక జాప్యం ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో 2026-27 బడ్జెట్‌లో సంక్షేమం కంటే అభివృద్ధి వ్యయానికే అధిక ప్రాధాన్యం దక్కే అవకాశముందని అంచనాలు ఉన్నాయి. క్యాపిటల్ వ్యయం పెంపు, రక్షణ రంగంలో మూలధన ఖర్చులను 30 శాతానికి పైగా పెంచడం, మౌలిక వసతులపై మరింత దృష్టి పెట్టడం వంటి నిర్ణయాలు వచ్చే అవకాశముంది. కొత్త హామీల కంటే ఇప్పటికే ప్రకటించిన పథకాల అమలుపైనే ప్రభుత్వం ఫోకస్ పెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తం మీద ఈసారి బడ్జెట్ 'ప్రకటనల పద్దు' నుంచి 'అమలు పద్దు' వైపు అడుగులు వేయనుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

# ఒక్కరోజే రూ.14,000 తగ్గిన తులం బంగారం

**వేద న్యూస్ డెస్క్:**

బులియన్ మార్కెట్‌లో తీవ్ర ఒడిదుడుకులు కనిపిస్తున్నాయి. నిన్నమొన్నటిదాకా దేశీయంగా ఆల్‌టైమ్ హై రికార్డులతో దూసుకుపోయిన బంగారం, వెండి ధరలు.. శుక్రవారం భారీగా తగ్గాయి. ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు.. ఒక్కరోజే రూ.14,000 (7.65 శాతం) పడిపోయి రూ.1,69,000 (అన్ని పన్నులతో సహా) వద్ద స్థిరపడింది. గురువారం రూ.12,000 పుంజుకొని మునుపెన్నడూ లేనివిధంగా రూ.1,83,000 పలికిన విషయం తెలిసిందే. మరోవైపు వెండి ధర కిలో ఏకంగా రూ.20,000 (దాదాపు 5 శాతం) క్షీణించింది. దీంతో రూ.3,84,500 (అన్ని పన్నులతో సహా) దగ్గర స్థిరపడింది. అంతకుముందు రోజు రూ.19,500 ఎగబాకి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.4,04,500ని చేరిన సంగతి విదితమే.

**హైదరాబాద్‌లో..**

హైదరాబాద్‌లో 22 క్యారెట్ (99.5 స్వచ్ఛ త) పుత్తడి తులం ధర రూ.1,55, 100గా ఉన్నది. ఇక కిలో వెండి రేటు రూ.3,95,000 పలికింది. కాగా, అంతర్జాతీయ మార్కెట్ నుంచి బలహీన సంకేతాలు, అమెరికా డాలర్ తిరిగి బలపడుతుండటంతో మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపారని, అందుకే డిమాండ్ పడిపోయి గోల్డ్, సిల్వర్ ధరలు క్షీణించాయని మార్కెట్ నిపుణులు తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ రేటు 285.30 డాలర్లు దిగి 5,087.73 డాలర్లుగా ఉన్నది. ఒకానొక దశలోనైతే 425.86 డాలర్లు పతనం కావడం గమనార్హం. ఔన్స్ సిల్వర్ ధర కూడా 14 డాలర్లు కోల్పోయి 101.47 డాలర్లుగా నమోదైంది. ట్రేడింగ్ మధ్యలోనైతే 95.26 డాలర్ల స్థాయికి పడిపోయింది




**ఫ్యూచర్ మార్కెట్‌లో..**

స్పాట్ మార్కెట్‌తోపాటు ఫ్యూచర్ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు బాగా తగ్గిపోయాయి. సిల్వర్ ఫ్యూచర్స్ 17 శాతం, గోల్డ్ 9 శాతం క్షీణతను చూశాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌పై మార్చి డెలివరీకిగాను వెండి కిలో ధర రూ.3,32,002 పలికింది. క్రితం రోజు ట్రేడింగ్‌తో చూస్తే ఎప్పుడూ లేనంతగా ఒక్కరోజే రూ.67,891 పడిపోయింది. ఇక ఫిబ్రవరి కాంట్రాక్టుకుగాను గోల్డ్ 10 గ్రాముల ధర రూ.15,246 క్షీణించి రూ.1,54,157గా నమోదైంది. గురువారం సిల్వర్ రూ.4,20, 048, గోల్డ్ రూ.1,80, 779గా ట్రేడ్ అయిన విషయం తెలిసిందే. ఇక అంతర్జాతీయంగా కూడా ఫ్యూచర్ మార్కెట్‌లో గోల్డ్, సిల్వర్ ఆదరణను కోల్పోయాయి. కామెక్స్‌లో మార్చి డెలివరీకి ఔన్స్ వెండి 95.12 డాలర్లుగానే ట్రేడైంది. ఏప్రిల్ డెలివరీకి ఔన్స్ గోల్డ్ 4,962.7 డాలర్లుగానే పలికింది. క్రితం రోజు ముగింపుతో చూస్తే.. వరుసగా 19.30 డాలర్లు, 392.10 డాలర్లు నష్టపోయాయి.

# ఈ విషయంలో భారత్ వరల్డ్ నెం.2.. ఎలాన్ మస్క్ సంచలన పోస్ట్!



**వేద న్యూస్ డెస్క్:**

భారత్ శరవేగంగా అభివృద్ధి దిశగా దూసుకెళ్తూ ప్రపంచ దేశాలతో పోటీ పడుతోంది. ప్రతి రంగంలో వృద్ధిని నమోదు చేస్తూ ప్రపంచంలోనే అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థగా నిలుస్తోంది. జీడీపీలో భారత్ స్థానం నిరంతరం మెరుగుపడుతుండగా, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చేసిన ఒక ట్వీట్ అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది. బ్యాలెన్స్ పవర్ మారుతోందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు గ్లోబల్ మార్కెట్ల దృష్టిని ఆకర్షించాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి డేటాను ప్రస్తావిస్తూ ప్రపంచ దేశాల జీడీపీపై మస్క్ చేసిన పోస్ట్ ప్రస్తుతం విస్తృతంగా చర్చకు దారితీసింది. 2026 డేటా ప్రకారం ప్రపంచ జీడీపీ వృద్ధిలో టాప్ 10 దేశాల జాబితాలో భారత్ రెండో స్థానంలో నిలిచింది. తొలి స్థానంలో చైనా 26.2 శాతం వాటాతో కొనసాగుతుండగా, భారత్ 17.0 శాతంతో తర్వాతి స్థానాన్ని దక్కించుకుంది. యునైటెడ్ స్టేట్స్ 9.9 శాతంతో మూడో స్థానంలో ఉండగా, ఇండోనేషియా 3.8 శాతంతో నాలుగో స్థానంలో ఉంది. తుర్కియే 2.2 శాతంతో ఐదో స్థానం, నైజిరియా 1.5 శాతంతో ఆరో స్థానం పొందాయి. బ్రెజిల్ 1.5 శాతంతో ఏడో స్థానంలో నిలిచినప్పటికీ, వియత్నాం 1.6 శాతంతో ఎనిమిదో స్థానం, సౌదీ అరేబియా 1.7 శాతంతో తొమ్మిదో స్థానం దక్కించుకున్నాయి. జర్మనీ 0.9 శాతంతో పదో స్థానంలో ఉంది. చైనా, భారత్ కలిసి ప్రపంచ జీడీపీ వృద్ధిలో 43.6 శాతం వాటా కలిగి ఉండటం విశేషం.

# చిట్టి ఇంతలా మారిపోయిందా..!

## - రొమాంటిక్ సీన్స్‌తో షాక్ ఇచ్చిన ఫరియా అబ్దుల్లా..

**వేద న్యూస్ డెస్క్:**

'జాతిరత్నాలు' సినిమాతో ఒక్కసారిగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఫరియా అబ్దుల్లా పేరు చెబితే ఇప్పటికీ చాలామందికి 'చిట్టి' పాత్రే గుర్తుకొస్తుంది. ఆ సినిమా తర్వాత కెరీర్ ఆశించి నంత వేగంగా సాగకపోయినా, తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకునేందుకు ఆమె ప్రయత్నాలు కొనసాగిస్తోంది. మధ్యలో చేసిన కొన్ని సినిమాలు పెద్దగా విజయం సాధించకపోయినా, సోషల్ మీడియాలో గ్లామరస్ ఫోటోలు, వీడియోలతో అభిమానులకు దగ్గరగా ఉంటూ తన పాపులారిటీని కొనసాగిస్తోంది. తాజాగా తిరువీర్ హీరోగా తెరకెక్కుతున్న 'భగవంతుడు' సినిమా టీజర్ విడుదల కావడంతో ఫరియా మరోసారి చర్చనీయాంశమైంది. ఈ టీజర్‌లో ఆమె లుక్, పాత్ర రూపకల్పన ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఒకవైపు పల్లెటూరి అమ్మాయిలా లంగా ఓణీలో కనిపిస్తూనే, మరోవైపు కథ డిమాండ్ మేరకు బోల్డ్ షేడ్స్ ఉన్న సీన్స్‌లో కనిపించడం ప్రత్యేకంగా నిలిచింది. ముఖ్యంగా రొమాంటిక్ సన్నివేశాలు, లిప్‌లాక్ షాట్, చివర్లో రౌడీలకు ఎదురెళ్లే ధీటైన ఎక్స్‌ప్రెషన్స్ చూస్తే ఇప్పటివరకు చూసిన ఇమేజ్‌కు పూర్తిగా భిన్నంగా ఆమెను చూపించినట్లు తెలుస్తోంది. కంటెంట్ బలంగా ఉంటే గ్లామర్ రోల్స్ చేయడంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని ఫరియా ఇప్పటికే పలుమార్లు చెప్పింది. అదే మాటకు తగ్గట్టుగానే ఈ పీరియడ్ రూరల్ డ్రామాలో ఆమె పాత్రను డిజైన్ చేసినట్లు టీజర్ ద్వారా స్పష్టమవుతోంది. గ్లామర్‌తో పాటు ఎమోషన్, ఆగ్రహం, అమాయకత్వం కలగలిపిన పాత్రగా ఇది కనిపిస్తోందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. 'జాతిరత్నాలు' తర్వాత సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఫరియాకు 'భగవంతుడు' కీలక మలుపుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. నటనకు మంచి స్కోప్ ఉన్న ఈ పాత్రతో ఆమె మళ్లీ ఫామ్‌లోకి వస్తుందా లేదా అన్నది చూడాలి. టీజర్‌తో సినిమాపై ఆసక్తి పెరిగిన నేపథ్యంలో, సోషల్ మీడియాలో మ్యాజిక్ చేసిన చిట్టి ఈసారి వెండితెరపై కూడా అదే మ్యాజిక్ రిపీట్ చేస్తుందేమోనని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



# టాలీవుడ్ డ్యాన్సర్లకు రామ్ చరణ్ అండ..

## - 500 కుటుంబాలకు హెల్త్ ఇన్సూరెన్స్..!

**వేద న్యూస్ డెస్క్:**



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. టాలీవుడ్ డ్యాన్సర్స్ అసోసియేషన్‌కు చెందిన సుమారు 500 మంది సభ్యులు మరియు వారి కుటుంబాలకు ఉచిత హెల్త్ ఇన్సూరెన్స్ అందించే బాధ్యతను స్వీకరించారు. గతంలో తన పుట్టినరోజు సందర్భంగా ఇచ్చిన హామీని నెరవేర్చుతూ హెల్త్ కార్డుల పంపిణీకి సంబంధించిన ప్రతిపాదనను తాజాగా ఆమోదించినట్లు సమాచారం. ఈ పథకం కోసం సుమారు రూ.50 లక్షల వరకు వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. సినీ షూటింగ్‌లలో ప్రమాదాలను ఎదుర్కొంటూ పనిచేసే డ్యాన్సర్లు అనారోగ్యం లేదా ప్రమాదాల సమయంలో ఆర్థిక ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో చరణ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రతి డ్యాన్సర్ కుటుంబానికి సమగ్ర ఆరోగ్య బీమా అందేలా ఈ పథకాన్ని రూపొందించారు. తన భార్య ఉపాసన కొణిదెలతో కలిసి ఈ సేవా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న రామ్ చరణ్, సామాజిక బాధ్యతలో మెగాస్టార్ చిరంజీవి బాటలోనే ముందుకు సాగుతున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం భారీ సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ సినీ కార్మికుల భద్రత కోసం ముందుకు రావడంపై డ్యాన్సర్ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిర్ణయంతో 500కు పైగా కుటుంబాలకు వైద్య భరోసా లభించగా, చరణ్‌ను రియల్ లైఫ్ హీరోగా పరిశ్రమ కొనియాడుతోంది.

# జూలైలోనే మెగా సందడి.. 'విశ్వంభర' రిలీజ్‌కు సన్నాహాలు!




**వేద న్యూస్ డెస్క్:**

సంక్రాంతికి విడుదలైన 'మన శంకరవరప్రసాద్‌గారు' చిత్రంతో బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్న అగ్ర కథానాయకుడు చిరంజీవి ఇప్పుడు తన తదుపరి సోషియో ఫాంటసీ యాక్షన్ థ్రిల్లర్ 'విశ్వంభర'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే రూ.360 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన విజయోత్సాహంలో ఉన్న ఆయన ఈ భారీ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తోంది. గతేడాదే చిత్రీకరణ పూర్తయినప్పటికీ, వీఎఫ్ఎక్స్ పనుల కారణంగా సినిమా విడుదల ఆలస్యమవుతూ వచ్చింది. ప్రస్తుతం గ్రాఫిక్స్ పనులు తుదిదశకు చేరుకోవడంతో జూలై తొలి వారంలో, ముఖ్యంగా జూలై 9 లేదా 10 తేదీల్లో సినిమాను విడుదల చేయాలని చిత్రబృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇటీవల జరిగిన విలేకర్ల సమావేశంలో చిరంజీవి కూడా జూలైలో సినిమా వచ్చే అవకాశముందని సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనే లక్ష్యంతో మేకర్స్ కేవలం గ్రాఫిక్స్ కోసమే సుమారు రూ.75 కోట్ల వరకు ఖర్చు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలుగా నటిస్తుండగా, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతాన్ని అందిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.

# మళ్ళీ జంటగా శివాజీలయ..!

**వేద న్యూస్ డెస్క్:**




టాలీవుడ్ సీనియర్ నటీనటులు శివాజీ, లయ చాలా కాలం తర్వాత జంటగా నటించిన క్రైమ్ కామెడీ చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' డిజిటల్ విడుదలకు సిద్ధమైంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం థియేటర్లకు రాకుండా నేరుగా ఓటీటీ వేదికపై ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఈటీవీ విన్ ఈ సినిమా హక్కులను సొంతం చేసుకోగా, ఫిబ్రవరి 12 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఒకప్పుడు వెండితెరపై సూపర్ హిట్ జోడీగా గుర్తింపు పొందిన శివాజీలయ కాంబినేషన్ మళ్లీ రావడం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'స్వయంవరం', 'టాటా బిర్లా మధ్యలో లైలా' వంటి చిత్రాల్లో వీరి కెమిస్ట్రీ ప్రత్యేకంగా నిలిచింది. ఇప్పుడు క్రైమ్ ఎలిమెంట్స్ కలిసిన కామెడీ ఎంటర్‌టైనర్‌తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. వెరైటీ టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాకు ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రమోషనల్ కంటెంట్ మంచి స్పందన తెచ్చుకున్నాయి. నవ్వులతో పాటు ఉత్కంఠను కలగలిపిన కథతో రూపొందిన ఈ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్‌ను కూడా ఆకట్టుకునే అవకాశముందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. చాలా గ్యాప్ తర్వాత తమ అభిమాన జోడీని మళ్లీ ఒకే తెరపై చూడబోతున్నామని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సెంచరీ హీరో ఇషాన్ కిషన్ సిక్సర్ల వర్షం




**వేద న్యూస్ డెస్క్:**

న్యూజిలాండ్‌తో జరుగుతున్న ఐదో, ఆఖరి టీ20 మ్యాచ్‌లో భారత జట్టు పరుగుల సునామీ సృష్టించింది. తిరువనంతపురం గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం వేదికగా బ్యాటర్లు సిక్సర్ల వర్షం కురిపించడంతో, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 271 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. యువ ఓపెనర్ ఇషాన్ కిషన్ (103) అద్భుత సెంచరీతో కదం తొక్కగా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (63), హార్దిక్ పాండ్యా (42) మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగారు. అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో టీమిండియాకు ఇది మూడో అత్యధిక స్కోరు కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. అయితే, ఆరంభంలోనే టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. సంజూ శాంసన్ (6), అభిషేక్ శర్మ (30) స్వల్ప వ్యవధిలో ఔటవడంతో 48 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తో కలిసి ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టడమే కాకుండా, స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఈ జోడీ కివీస్ బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శిస్తూ మూడో వికెట్‌కు కేవలం 57 బంతుల్లోనే 137 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పింది. ముఖ్యంగా ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 43 బంతుల్లో 6 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో 103 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అతనికి తోడుగా సూర్యకుమార్ యాదవ్ 30 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లతో 63 పరుగులు చేశాడు. వీరిద్దరూ ఔటైన తర్వాత, చివర్లో హార్దిక్ పాండ్యా కేవలం 17 బంతుల్లోనే 1 ఫోర్, 4 సిక్సర్లతో 42 పరుగులు చేసి స్కోరును 270 దాటించాడు. రింకూ సింగ్ (8లి), శివమ్ దూబే (7లి) నాటౌట్‌గా నిలిచారు. న్యూజిలాండ్ బౌలర్లలో లాకీ ఫెర్గూసన్ రెండు వికెట్లు తీసినప్పటికీ 41 పరుగులు సమర్పించుకున్నాడు. కెప్టెన్ మిచెల్ శాంట్నర్ తన 4 ఓవర్లలో 60 పరుగులు, కైల్ జేమీసన్ 59 పరుగులు ఇవ్వడంతో కివీస్ బౌలింగ్ విభాగం పూర్తిగా తేలిపోయింది.

# చివరి టీ20 మనదే... కివీస్ పోరాటం చాల్లేదు!

**వేద న్యూస్ డెస్క్:**



న్యూజిలాండ్‌తో జరిగిన ఐదో, చివరి టీ20లో టీమిండియా 46 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఇషాన్ కిషన్ (103) విధ్వంసక సెంచరీకి, అర్ష్‌దీప్ సింగ్ (5/51) ఐదు వికెట్ల ప్రదర్శన తోడవడంతో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-1 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. భారత్ నిర్దేశించిన 272 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో, కివీస్ 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ అయింది. భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్‌కు ఫిన్ అలెన్ (38 బంతుల్లో 80) అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీంతో కివీస్ పవర్‌ప్లేలో వికెట్ నష్టానికి 79 పరుగులు చేసి భారత్‌పై తమ అత్యుత్తమ పవర్‌ప్లే స్కోరును నమోదు చేసింది. అయితే, దూకుడుగా ఆడుతున్న అలెన్‌ను అక్షర్ పటేల్ (3/33) పెవిలియన్ పంపడంతో మ్యాచ్ మలుపు తిరిగింది. తొలి స్పెల్‌లో భారీగా పరుగులు ఇచ్చినప్పటికీ, అర్ష్‌దీప్ సింగ్ తన రెండో స్పెల్‌లో అద్భుతంగా రాణించాడు. కీలకమైన రచిన్ రవీంద్ర (30) వికెట్‌తో పాటు మరో నాలుగు వికెట్లు తీసి కివీస్ పతనాన్ని శాసించాడు. దీంతో న్యూజిలాండ్ 19.4 ఓవర్లలో 225 పరుగులకు ఆలౌట్ అయింది. టీ20 ప్రపంచకప్‌కు వారం ముందు ఈ సిరీస్ విజయం భారత జట్టు ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచనుంది. అంతకుముందు, టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 271 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ కేవలం 42 బంతుల్లోనే తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని నమోదు చేశాడు. అతనికి కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (63) చక్కటి సహకారం అందించాడు. చివర్లో హార్దిక్ పాండ్యా (17 బంతుల్లో 42) మెరుపు ఇన్నింగ్స్‌తో భారత్ స్కోరును అమాంతం పెంచాడు. ఇది టీ20 ఫార్మాట్‌లో భారత్‌కు మూడో అత్యధిక స్కోరు కావడం విశేషం.

# ఆస్ట్రేలియా ఓపెన్ 2026.. మహిళల విజేతగా రిబకినా

**వేద న్యూస్ డెస్క్:**

ఆస్ట్రేలియా ఓపెన్ 2026 మహిళల సింగిల్స్ విభాగంలో కజకిస్తాన్‌కు చెందిన ఎలెనా రిబకినా అద్భుత ప్రదర్శనతో ఛాంపియన్‌గా నిలిచింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో బెలారస్ స్టార్ అరినా సబలెంకాపై 6-4, 4-6, 6-4 తేడాతో విజయం సాధించి ప్రతిష్ఠాత్మక కిరీటాన్ని కైవసం చేసుకుంది. మ్యాచ్ ప్రారంభం నుంచే దూకుడు ప్రదర్శించిన రిబకినా తొలి గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసి ఆధిపత్యం చాటింది. అదే జోరును కొనసాగిస్తూ మొదటి సెట్‌ను 6-4తో సొంతం చేసుకుంది. అయితే రెండో సెట్‌లో సబలెంకా గట్టిగా తిరగబడి అదే స్కోర్‌తో సెట్ గెలిచి మ్యాచ్‌ను సమం చేసింది. దీంతో విజేతను నిర్ణయించే మూడో సెట్ మరింత ఉత్కంఠను రేపింది. నిర్ణయాత్మక సెట్‌లో సబలెంకా 3-0 ఆధిక్యంలోకి వెళ్లి టైటిల్‌కు చేరువైనట్టే కనిపించింది. కానీ రిబకినా అసాధారణమైన పట్టుదల చూపించింది. వరుసగా రెండు సార్లు సబలెంకా సర్వీస్‌ను బ్రేక్ చేసి మ్యాచ్ గమనాన్ని మార్చేసింది. చివరికి మూడో సెట్‌ను 6-4తో ముగించి కెరీర్‌లో తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను అందుకుంది. ఇది ఆమెకు రెండో గ్రాండ్‌స్లామ్ కిరీటం కావడం విశేషం. 2023 ఫైనల్‌లో ఇదే ప్రత్యర్థి చేతిలో ఓటమి చవిచూసిన రిబకినా, ఈసారి ప్రతీకారం తీర్చుకుంటూ ఘన విజయం సాధించింది. మరోవైపు సబలెంకా వరుసగా రెండోసారి ఫైనల్‌లోనే నిలిచిపోవాల్సి వచ్చింది.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073